ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 25.0



ఏలూరులో వర్షంలో విద్యార్థినులు

దంచికొడుతున్న వర్షాలు

ఏలూరుసిటీ/ భీమడోలు/పోలవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో శనివారం ఏలూరు నగరంతోపాటు పలు పట్టణాలు, వివిధ ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వర్షాలతో రహదారుల పైన నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఏలూరు నగరంలో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా జంగారెడ్డిగూడెం మండలంలో 60.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి 2.2 మి.మీ నమోదైంది. జిల్లాలో జోరుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్థంభించింది. సార్వా సాగు పనులు మాత్రం ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భీమడోలులో గాంధీ బొమ్మసెంటర్, పంచాయతీ రోడ్డు, భీమడోలు జంక్షన్ జలమయం అయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, జలమయం కాగా డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. పోలవరంలో వీచిన ఈదురు గాలులకు మెయిన్ సెంటర్‌లో ఉన్న పలు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఎగిరిపడ్డాయి.పోలవరం- ఇటుకలకోట బోడిగూడెం గ్రామాల మధ్య రోడ్డు మార్గంలో విద్యుత్ తీగలు తెగి పడడంతో సిబ్బంది మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



భీమడోలులో నీట మునిగిన రోడ్డు



ఏలూరులో జోరువాన



అమెరికా హడల్..!

చెదిరిన డాలర్ కల.. హెచ్ 1బీ వీసాలపై ట్రంప్ కొరడా

రెన్యువల్‌కు లక్ష డాలర్లు.. కొత్త నిబంధనతో చదువులకే పరిమితం

పూర్తికాగానే.. స్వదేశానికి రావాల్సిందే.. జిల్లావాసులపై భారీ ప్రభావం

మా అబ్బాయి అమెరికాలో ఉంటున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. మంచి పొజిషన్‌లో వున్నాడు. ఇల్లు కూడా కొనుక్కున్నాడు. మొన్ననే.. గృహ ప్రవేశానికి వెళ్లి రెండు నెలలు ఉండి వచ్చాం. గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేశాడు. ఇంకా రాలేదు. వస్తే అక్కడే స్థిరపడిపోతాడు. ఇపుడేమో హెచ్ 1బీ వీసాకు డబ్బులు కట్టాలంటున్నారు.. ఏమిటో అర్థం కావడం లేదు.

- పది రోజుల క్రితం.. నరసాపురానికి చెందిన ఓ రైతు ఒక ప్రజా ప్రతినిధితో చెప్పిన మాటలు.

మా అమ్మాయి అమెరికాలో ఎంఎస్ చేస్తోంది. ఏడాది అయ్యింది. మరో ఏడాది గడిస్తే.. చదువు పూర్తవుతుంది. పాపను పంపడానికి రూ.50 లక్షలు బ్యాంకు లోన్ తీసుకున్నాం. ఉద్యోగం వచ్చి ఏమైనా పంపితే... బాకీ తీరుతుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వచ్చిన తర్వాత అక్కడ ఉద్యోగాలు దొరకడం లేదంట. మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

- తణుకుకు చెందిన ఒకరు బంధువుల వద్ద చెబుతున్న మాటలు.

(నరసాపురం-ఆంధ్రజ్యోతి): ఇప్పటికే డాలర్ డ్రీమ్స్ కల్లలవున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చిన తర్వాత ఆ దేశంపై ఆధారపడిన వివిధ వర్గాలు కుదేలయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి ట్రంప్ మరో బాంబు పేల్చాడు. హెచ్ 1బీ వీసాల రెన్యువల్‌కు రూ.లక్ష డాలర్ల ఫీజు కట్టాలని ప్రకటించాడు. ట్రంప్ కొత్త నిర్ణయం ఉద్యోగాలు, చదువుల నిమిత్తం వెళ్లిన వారిని తీవ్ర కలవరానికి గురిచేస్తోంది.

అమెరికాకు చదువులు, ఉద్యోగాలకు వెళ్లిన వారిలో అత్యధికులు గోదావరి జిల్లాల వాసులే. అందులో పశ్చిమ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువే. రెండేళ్ల నుంచి చదువుల నిమిత్తం వెళుతున్న వారి సంఖ్య కొద్దీగా తగ్గినా.. హెచ్ 1బీ వీసాలపై వెళ్లి ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య అత్యధికం. జిల్లాలోని ప్రతి ఊరి నుంచి కనీసం నలుగురైనా అమెరికాలో ఉన్నారు. ఈ లెక్కన ఒక్కో మండలం, పట్టణం నుంచి 50 మందికిపైగా లెక్క తేలతారు. వీరిలో అమెరికా వెళ్లి పదేళ్లు దాటిన వారు ఉన్నారు. చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య ఎక్కువే. ఒక్కసారి హెచ్ 1బీ వీసా లభిస్తే అమెరికాలో మూడేళ్లు ఉద్యోగం చేయవచ్చు. ఆ తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. ఇలా గ్రీన్‌కార్డు వచ్చే వరకు ఏడాదికి వెయ్యి డాలర్లు ఫీజు కట్టి పొడిగించుకునే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం జిల్లా నుంచి అక్కడికి వెళ్లి ఇంకా గ్రీన్‌కార్డు రాని వారిలో ఎక్కువ మంది ఈ కోవకు చెందిన వారే ఉన్నారు. ఇటు చదువుల నిమిత్తం వెళ్లిన వారు పూర్తికాగానే ఏదో కంపెనీలో చేరి హెచ్ 1బీ వీసా సంపాదించి అక్కడే ఉండిపోతున్నారు.

ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం

అమెరికాలో ఉండి వీరు పంపుతున్న డాలర్లతో చాలా కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. వ్యాపార లావాదేవీలు పెరిగాయి. అత్యధికంగా భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఉండి, పాలకొల్లు, ఆచంట ప్రాంతాల వారే ఎక్కువ. ట్రంప్ నిర్ణయంతో ప్రస్తుతం వీరంతా షాక్ తిన్నారు. తమ పిల్లల పరిస్థితి ఏమిటంటూ ఆందోళన చెందుతున్నారు. విదేశాలపై కొద్దిగా అనుభవం ఉన్న వారికి ఫోన్ చేసి తమ పిల్లలను అక్కడ ఉంచుతారా ? లేక పంపేస్తారా ? అన్న విషయాన్ని ఆరా తీస్తున్నారు. అమెరికాలోని తమ పిల్లలకు ఫోన్ చేసి పరిస్థితిని తెలుసుకుంటున్నారు. ఈ విషయంపై అమెరికాలో ఉన్న వారెవరూ స్పష్టత ఇవ్వడం లేదు. కొత్తగా వచ్చే వారికి ఈ నిబంధన వర్తిస్తుందా...? లేక పాత వారికి కొనసాగుతుందా ? అన్నది తెలియాల్సి వుంది. మరో రెండు రోజులు గడిస్తే గాని స్పష్టత రాదు. ట్రంప్ నిర్ణయం ఆమెరికా వెళ్లి చదువుకోవాలని కలలు కంటున్న వారి ఆశలను అడియాశలు చేస్తోంది.

వేర్వేరు కారణాలతో ఒకే రోజు ఐదుగురి ఆత్మహత్య

■ లోపలి పేజీలో..



■ లోపలి పేజీలో..

ప్రియమైన నీకు..

» నేడు భార్యను ప్రశంసించే రోజు

24 నుంచి రైల్వే గేటు మూసివేత

కైకలూరు, సెప్టెంబరు 20(ఆంధ్ర జ్యోతి): పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో మండవల్లి మండలం భైరవపట్నంలోని 71వ రైల్వే గేటును ఈనెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఏడు రోజులపాటు మరమ్మతుల నిమిత్తం మూసివేయనున్నట్టు కైకలూరు రైల్వేసెక్షన్ ఇంజనీర్ ఎండీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని సూచించారు.

నేను మాట మార్చలేదు..

» మంత్రి కొలుసు స్పష్టీకరణ

నూజివీడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలిపే విషయంలో తాను మాట మార్చానని చేస్తున్న ప్రచారంలో నిజం లేదని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. నూజివీడులో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ సభలో ఆయన మాట్లాడుతూ.. 'మంత్రివర్గ సమావేశంలో ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. ఆయన 'అవును.. నేను నూజివీడు ప్రజలకు హామీ ఇచ్చాను' అంటూ స్పందించారు. ప్రజల ఆకాంక్షను మంత్రివర్గ సబ్‌కమిటీకి వివరించాము. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పునర్ విభజన విషయంలో ఈ కమిటీ అధ్యయనం చేస్తోంది. త్వరలో నియోజకవర్గ ప్రజలకు అనుకూల నిర్ణయం వస్తుంది. కొందరు రాజకీయ దురుద్దేశంతో నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. విజ్ఞులైన న్యాయవాదులు ఈ విషయం గుర్తించాలి' అంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

చింతలపూడిలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటుపై కదలిక

చింతలపూడి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం చింతలపూడిలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు కదలిక వచ్చింది. నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ చింతలపూడిలో బస్సు డిపో ఏర్పాటుపై రవాణ శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణలను గతవారం కలిసి చర్చించారు. డిపో ఏర్పాటుకు స్థలాన్ని తాను చూపుతానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నేపథ్యంలో రవాణ శాఖ ముఖ్య కార్యదర్శి చింతలపూడిలో బస్సు డిపో ఏర్పాటుకు సంబంధించి ఆ శాఖ కమిషనర్‌ను, రవాణ శాఖ ఎండీని నివేదిక కోరారు. రవాణ శాఖ, ఆర్టీసీ అధికారులు త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం. 50ఏళ్ల కలగా ఉన్న డిపో ఏర్పాటుపై కదలిక రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అన్నదాత సుఖీభవ!

» పేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్లు
» ఏలూరు నగరంలో నాలుగు నిర్వహణ
» ఏడాదిలో 14 లక్షల మందికి ఆహారం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత.. ఆ బాధ్యతను టీడీపీ ప్రభుత్వం సక్రమంగా నిర్వహిస్తూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల కడుపు నింపుతోంది. ఏలూరు నగరంలోని నాలుగు క్యాంటీన్లలో రోజుకు సగటున 3,975 మంది భోజనం చేస్తున్నారు. గతేడాది ఆగస్టు 16న పునః ప్రారంభమైన అన్న క్యాంటీన్లలో ఇప్పటి వరకు దాదాపు 14.5 లక్షల మంది భోజనం చేసి కడుపు నింపుకున్నారు. ఒక్కో ప్లేటుకు ప్రభుత్వం రూ.34 ఖర్చు పెడు తుండగా ఐదు రూపాయలను మాత్రమే ప్రజల నుంచి వసూలు చేస్తూ రూ.29లను భరిస్తోంది. ఈ లెక్కన నగరంలోని నాలుగు అన్న క్యాంటీన్లకు ప్రభుత్వం దాదాపు రూ.కోటి 43 లక్షలు ఖర్చు చేసింది.

వైసీపీ పాలనలో మూసివేత

2018లో అనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. మరుసటి ఏడాది అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా వాటిని మూసివేసింది. ఆ ఐదేళ్లలో పేదలు ఆకలితో అలమటించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గతేడాది ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లు మరలా పునఃప్రారంభిస్తానని ప్రకటించారు. ఇచ్చిన వాగ్దానం మేరకు మరల 2024 ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించారు.

మంచి రుచి, నాణ్యతతో ఆహారం

ఏలూరు నగరంలో జిల్లా కలెక్టరేట్ వద్ద, ఆర్‌ఆర్.పేట (మిగతా 8వ పేజీలో)

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి : ఎస్పీ



ఏలూరు క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి):ముద్దాయిలకు శిక్షపడేలా సమర్థవంతంగా కోర్టు కానిస్టేబుళ్లు విధును నిర్వర్తించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశించారు. ఏలూరు జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకోవా లంటూ పలు సూచనలు చేశారు. ఏఎస్పీ సూర్యచంద్ర రావు, కోర్టు మానిటరింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, డీసీఆర్బీసీ సిబ్బంది పాల్గొన్నారు.



టెక్ జెట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డిసెంబరు 18 నుంచి టెక్ జెట్-25

నూజివీడు టౌన్, సెప్టెం బరు 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో జాతీయ స్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ డిసెంబరు 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. టెక్ జెట్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. టెక్నికల్ ఈవెంట్స్, ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్, తదితర యాక్టివిటీస్ నిర్వహిస్తామన్నారు. సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, ఏవో డాక్టర్ లక్ష్మణరావు, డీన్ డాక్టర్ సాదు చిరంజీవి పాల్గొన్నారు.

ఇంటి దొంగలెవరు ?

ఆర్‌అండ్‌బీ క్రెడిట్ సొసైటీలో డిపాజిట్ సొమ్ములు పక్కదారి

ఆలస్యంగా వెలుగు చూసిన అవినీతి
పలువురు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు
సహకార శాఖ అధికారితో విచారణకు ఆదేశం
అసలు, వడ్డీ రాక చిరుద్యోగుల అవస్థలు

ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లో డిపాజిట్ సొమ్ములు పక్కదారి పట్టాయి. కొందరు ఆర్థిక అవకతవకలకు పాల్పడడంతో రావాల్సిన సొమ్ములు ఏళ్ల తరబడి అందక డిపాజిట్ దారులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై బాధితులు ఇటీవల పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో సహకార శాఖ అధికారి విచారణ జరుపుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి): ఏలూరు కేంద్రంగా జిల్లా రోడ్లు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వెనుక ఆర్ అండ్‌బీ ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వుంది. పాలక వర్గం లేని సమయంలో కొందరు ఉద్యోగులు అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్, గుమస్తాలుగా నియమితులయ్యారు. ఆ సమయంలో వంద మంది ఉద్యోగులు సభ్యులుగా వున్నారు. వీరంతా ఎక్కువ వడ్డీ వస్తుందని, అత్యవసరాలకు, ఇళ్లు, స్థలాలు కొనుగోలుకు ఉపయోగపడుతుందని రెండు, ఐదేళ్ల కాలపరిమితికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. ఏటా వార్షిక సమావేశాలను నిర్వహించి సభ్యులంతా లాభాలను డివిడెండ్లు పంచుకునేవారు. అయితే కొందరి ఉద్యోగుల స్వార్థం చిరుద్యోగుల పాలిట శాపంగా మారింది. డిపాజిట్ల సొమ్ములను పక్కదారి పట్టించారు.

ఆడిట్ లోపాలను కప్పిపుచ్చారా ?

క్రెడిట్ సొసైటీ లావాదేవీలు, ఇతర కార్యకలాపాలపై జిల్లా సహకార శాఖ ఆడిట్ విభాగం ఏటా ఆడిట్ నిర్వహించాలి. ఇందులో గుర్తించిన లోపాలను బయటపెట్టకుండా కప్పి ఉంచడంతో ఇప్పుడు 25 మందికి పైగా డిపాజిట్‌దారులకు అసలు మొత్తాలను ఇవ్వడమే గగనంగా మారింది. ఇందులో ఆరుగురు బయట వ్యక్తులు డిపాజిట్లు చేశారు. వీరికే దాదాపు రూ.33 లక్షలు చెల్లించాలి. మరోవైపు రూ.40 లక్షలు అప్పులు కట్టాలి. ఈ నేపథ్యంలో క్రెడిట్ సొసైటీ పీకలలోతు నష్టాల్లో కూరుకుపోయింది. 2009లో డిపాజిట్ చేసిన వారికి నేటికీ డిపాజిట్ మొత్తాలకు అసలు, వడ్డీ ఇవ్వడం లేదు. ఇక్కడ అనధికార గుమస్తా, ఆయనకుతోడు ఓ ప్రైవేట్ మహిళా చిరుద్యోగి డిపాజిట్‌దారులకు చుక్కలు చూపిస్తున్నారు. రికవరీలు అయితేనే అసలు ఇస్తామని చెబుతున్నారు.

పర్సన్ ఇన్‌చార్జ్ నియామకం

విషయం వెలుగు చూడడంతో నెల క్రితం సహకార శాఖ నుంచి కిరణ్‌కుమార్ అనే అధికారిని ఈ సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన పర్యవేక్షణలో రికవరీలు చేసి.. కాల పరిమితి తీరిన డిపాజిట్లకు అసలు మాత్రమే చెల్లిస్తున్నారు. అయితే ఏళ్ల తరబడి దాచుకున్నా తమకు ఏ ప్రయోజనం లేకపోయిందని చిరుద్యోగులు వాపోతున్నారు. క్రెడిట్ సొసైటీ అవకతవకలపై విచారణాధికారిగా నియమితులైన నాగేశ్వరరావు వివరణ ఇస్తూ శాఖాపరంగా విచారణ జరిపి మూడు నెలల్లోగా నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్టు తెలిపారు



మొండి బకాయిలు.. డిఫాల్టర్ల వల్లనే..

ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీలో బాధితులకు అసలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ సొసైటీ గతంలో రూ.20 లక్షలు రుణం తీసుకుంది. తిరిగి కట్టకపోవడంతో రూ.40 లక్షలకు చేరింది. సభ్యుల్లో 11 మంది డిఫాల్టర్లు ఉన్నారు. వీరిపై విచారణాధికారి లోతైన అధ్యయనం చేస్తే అసలు దొంగలు తేలతారని భావిస్తున్నాం. ఇటీవల ఇద్దరికి అసలు మొత్తాలు చెల్లించాం. 2011 డిపాజిట్లు చేసిన వారికి రికవరీ చేసిన మొత్తాల నుంచి అసలు మాత్రమే ఇవ్వగలు గుతున్నాం. బాధ్యులు ఎవరనేది తేలితే వారి నుంచి రెవెన్యూ రికవరీ యాక్టు కింద ఆయా మొత్తాలను వసూలు చేయడానికి అవకాశం ఉంది.

- కిరణ్‌కుమార్, పర్సన్ ఇన్‌చార్జి

తల్లిదండ్రుల పేరిట మొక్క నాటండి



మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

విద్యార్థులకు కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు

లింగపాలెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రుల పేరుతో ఒక మొక్కనాటి వాటిని సంరక్షించాలి. చదువుకుంటూనే పర్యావరణాన్ని, ప్రకృతిని ప్రేమించేలా ఎదగాలి' అంటూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి విద్యార్థులకు సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం లింగపాలెంలో ఆమె పర్యటించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో సబ్ కలెక్టర్ బి.వినూత్నతో కలసి మొక్కలు నాటారు. విద్యార్థులతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రం సందర్శించి కొద్దిసేపు టీచర్‌గా మారి చిన్నారులకు అక్షరాలు నేర్పించారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్మీ కంపోస్ట్ ఎరువును రైతులకు అందించారు. కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ సిబ్బందిని సన్మానించారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో ప్రజలు భాగస్వామ్యులవ్వాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ (మిగతా 8వ పేజీలో)

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అత్యాధునిక వైద్యపరికరాలు : ఎంపీ

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి రూ.కోటి వ్యయంతో అత్యాధునిక వైద్యపరికరాలు అందించనున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ శనివారం తెలిపారు. గతేడాది అక్టోబరులో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన వైద్యపరికరాల కొరతను గుర్తించారు. ఎంపీ చొరవతో కార్పొరేట్, సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద గేయిల్ ఇండియా సహకారంతో రూ.కోటి విలువైన పరికరాలు అందిస్తున్నామన్నారు. అనస్తీషియ వర్క్‌స్టేషన్ పరికరాలు, కార్డియోటోకోగ్రఫీ మిషన్లు, కంప్యూటరైజ్డ్ రేడియోగ్రఫీ సిస్టమ్స్, హెమటాలజీ అన్‌లైజన్, ఐసీఈ లైండ్ రిఫ్రిజిరేటర్లు అందిస్తున్నామన్నారు. ఈ వైద్య పరికరాలన్ని ప్రభుత్వ ఆసుపత్రికి చేరాయని, త్వరలో వీటిని ప్రారంభిస్తామన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి భవిష్యత్తులో శాయశక్తుల కృషి చేస్తానన్నారు.

కానరాని అటవీ మొక్కలు

» రూ.21 లక్షల నిధులు ఖర్చు.. ఐదుగురికి షోకాజ్ నోటీసులు

■ లోపలి పేజీలో..



వట్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న లేఖర్లు

రెండో రోజూ లేఖరుల పెన్‌డౌన్

ఏలూరు/పెదపాడు/భీమడోలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన దస్తావేజుల తయారీలో ఓటీపీ విధానం ఎత్తివేయాలని. తమ లైసెన్సులు పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు చేపట్టిన పెన్‌డౌన్ రెండోరోజు శనివారం కూడా కొనసాగించారు. రిజిస్ట్రేషన్లకు విఘాతం ఏర్పడింది. ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు, గారపాటి వీరాస్వామి, యు.పాపారావు, సముద్రాల నాగరాజు, సముద్రాల దుర్గారావు, వంకాయల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.పెదపాడు మండలం వట్లూరు, భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద లేఖరులు పెన్‌డౌన్ కొనసాగించారు.



ప్రియమైన నీకు..

నేడు భార్యను ప్రశంసించే రోజు

- గోదావరి జిల్లాల్లో భార్యా ప్రేమికులు అధికం
- అనేక కుటుంబాలను ముందుండి నడిపిస్తున్న భార్యలు

భార్యాభర్తల దాంపత్య జీవితాలకు గోదావరి జిల్లాల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఒకరినొకరు ఇష్టపడుతూ.. వారి కష్టాలను పంచుకుంటూ సంతోషంగా జీవితం గడుపుతారు. భార్య తన భర్త మెప్పు పొందేందుకు నిరంతరం ఎదురుచూస్తూ వుంటుంది. ఇంటి పనులతోపాటు కుటుంబ బాధ్యతలను నెరవేరుస్తుంది. ఈ క్రమంలో చేసిన పనికి భర్త నుంచి ఓ చిన్న పాటి ప్రశంస, మెచ్చుకోలు వస్తే ఆ పడిన కష్టమంతా మర్చిపోతుంది. మరింత ఉత్సాహంతో బాధ్యతను మీద వేసుకుంటుంది. భార్య ఎప్పుడూ కోరుకునేది ఇదే. ఈ విషయాన్ని గమనించి భర్త నడుచుకుంటే వారి కుటుంబ జీవితం అన్యోన్యంగా సుఖమయంగా ఉంటుంది. నేడు భార్యను ప్రశంసించే రోజు పురస్కరించుకుని.. ఆమె కష్టాన్ని గుర్తించండి. ఓ చిన్న కాంప్లిమెంట్ ఇవ్వండి. ఇందుకు ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం చదవండి.

పాలకొల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి)

నేడు దేశవ్యాప్తంగా ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో భార్యలే భర్తను హతమారుస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఆలుమగలుగా అన్యోన్య దాంపత్యం సాగించాల్సిన కుటుంబాలలో క్షణికమైన కోర్కెలు, తనివి తీరని ఆశలు పెడదోవ పట్టించి, చిన్నారులను సైతం హతమార్చడం.. ప్రియుడి సాకారంతో భర్తను సైతం అడ్డు తొలగించుకుంటున్న మహిళలు కథలు ఇటీవల పుంకానుపుంకాలుగా వెలుగులోకి వస్తున్నాయి.

గోదావరి జిల్లాల్లో భార్యలదే పెత్తనం..

గోదావరి జిల్లాల్లో ఒకటి, అర దారుణాలు చోటు చేసుకుంటునప్పప్పటికీ ఇక్కడ అధిక శాతం భార్యలదే పెత్తనం గోదావరి జిల్లాల్లోని కుటుంబాలలో 50శాతం పైబడి కుటుంబాల్లో భార్యలే పెత్తనం చలాయిస్తూ బాధ్యతలను మోస్తూంటారు. సంపన్న వర్గాలలో కేవలం పది శాతం మంది మహిళలే కుటుంబ పెద్దగా వ్యవహరిస్తుంటే ధనిక వర్గాలలో కుటుంబ వ్యవహారాలలో స్త్రీల పాత్ర అతి తక్కువగా ఉంది. కార్మిక కర్షక వర్గాలలోనూ పేద వర్గాలలోనూ కుటుంబాలలో భార్య, భర్త సమానంగానే బాధ్యతలు స్వీకరిస్తూ ఆధిపత్యం విషయంలోనూ సమానంగానే ఉంటారు. కుటుంబాన్ని క్రమపద్ధతిలో ముందుకు తీసుకెళ్లే విషయంలో గోదావరి జిల్లాలు ముఖ్యంగా గోదావరి పరీవాహక ప్రాంత కుటుంబాలు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి.

మహిళలు అభినందనీయులు..

గోదావరి జిల్లాలలో భార్యలను భర్తలు ఎక్కువగా అభినందస్తూనే ఉంటారు. వస్త్రధారణ మొదలుకొని, వంట బాగుందని పిండివంటలు బాగా చేస్తావని మాట మధురం. మనసు వెన్న వంటి అభినందనలే కాదు. పేకాట ఆడి అర్ధరాత్రి ఇంటికి వచ్చినా పూర్తిగా తాగి తూలుతూ తాగి వచ్చి తలుపు తట్టినా ఆప్యాయంగా అభిమానంగా తలుపు తీసే ఇల్లాలను అభినందించని భర్తలు లేరంటే అతిశయోక్తే కాదు. అవసరం ఉన్నా లేకున్నా భార్యను అభినందనలతో ముంచెత్తుతూ తమకు మానసిక, శారీరక హింసలు లేకుండా మగాళ్లు తమ భార్యల వద్ద అభినందస్తూ కనబడతారు. ఇటీవల కాలంలో అధిక శాతం కుటుంబాలలో నెలవారీ కుటుంబ ఖర్చుల బాధ్యతలను భార్య తీసుకుంటూ అనేక కుటుంబాలలో భర్తకు ఖర్చు వరకే డబ్బులు ఇస్తూ కుటుంబాన్ని చక్కగా ముందుకు తీసుకెళ్తూ అభినందనీయులుగా గృహిణులు నిలుస్తున్నారు.

భార్య బాధిత సంఘాలు

అక్కడక్కడా ఇటీవల భార్య బాధితులు వెలుగులోకి వస్తున్నారు. వీరిని ఆదుకోవడానికి భార్య బాధిత సంఘాలు వెలుస్తున్నాయి. తాడేపల్లిగూడెం వేదికగా భార్య బాధితుల సంఘం ఒకటి వెలిసింది. భార్యలు భర్తలను గృహహింసకు గురిచేసినా.. శారీరకు మానసిక హింసలకు పాల్పడినా భార్యలపై చర్యలు తీసుకోవడానికి భార్య బాధిత సంఘాలు చేదోడుగా ఉంటున్నాయి. భార్యని అభినందించే దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి పలువురిని పలకరించగా ఇలాంటి ఆసక్తికరమైన విషయాలూ వెలుగులోకి వచ్చాయి.

ఎప్పుడూ అభినందనీయురాలే..



ఉన్నత విద్యావంతురాలుగా లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ మరో వైపు ఇంటిపనులు చక్కబెట్టుకుంటూ ఏకైక కుమారుడిని ఉన్నత విద్యవైపు నడిపిస్తూ కుటుంబాన్ని తీర్చిదిద్దుతున్న నా భార్య సౌజన్య నాకు ఎప్పుడూ అభినందనీయురాలే. ప్రతి పనిలో భార్యను ఎప్పుడూ అభినందిస్తూనే ఉండాలి. భీమవరం కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు నా భార్య రూ.లక్ష విరాళం అందించడంతో ప్రత్యేకంగా అభినందించాను.

- దాసి రాజు
ఆర్డీవో, నరసాపురం

ఉన్నత విద్యకు ప్రోత్సహించా..



నా సతీమణి కె.రాజాశ్యామల వివాహం అనంతరం ఉన్నత విద్యకు ప్రోత్సహించా.. భార్యగా ఇంటికే పరిమితం కాకుండా ఉన్నత విద్య పట్ల ఆమెకు ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించా. వివాహం అనంతరం ఆమె ఎంటెక్ కంప్యూటర్ సైన్స్, ఎంబీఏ, ఎంపీఏ ఎంఏ, ఎంఫిల్, ఎల్ఎల్‌బీ పూర్తిచేసిన ఆమె ఇప్పుడు కంప్యూటర్ సైన్స్‌పై పీహెచ్‌డీ చేస్తుంది. ప్రస్తుతం ఆమె కోనసీమ కిమ్స్ మెడికల్ కళాశాల డైరెక్టర్‌గా పనిచేస్తుంది. కుటుంబ బాధ్యతలు చూస్తున్న నా భార్య ఎప్పుడూ అభినందనీయురాలే.

- డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ
పిల్లల వైద్యులు, పాలకొల్లు

అన్ని వేళల్లో చేదోడుగా..

ఒక వైపు ఉపాధ్యాయురాలుగా నా భార్య హైమావతి ఉద్యోగం చేస్తూ మరో వైపు ఇల్లు చక్కబెడుతూ కుమారుడిని ఉన్నత చదువుకు అమెరికా పంపి అన్ని సందర్భాల్లోనూ నాకు చేదోడుగా ఉంటున్న నా భార్య ఎప్పుడూ అభినందనీయురాలే. కేవలం భార్యల అభినందన దినోత్సవమే కాదు బాధ్యతాయుతంగా మెలిగే ప్రతీ సతీ తన భర్త అభినందనలు పొందుతూనే ఉంటుంది.



- మంతెన రామకృష్ణంరాజు,
ఆప్కాస్ అధికారి



కాళ్లకూరు వెంకన్నకు జలాభిషేకం (ఇన్‌సెట్‌లో) అలంకరణలో స్వామివారు

కాళ్లకూరు వెంకన్నకు జలాభిషేకం

- గోవింద నామస్మరణతో మార్మోగిన కాళ్లకూరు

కాళ్ల,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గోవిందా.. గోవింద.. అంటూ భక్తుల గోవింద నామస్మరణతో కాళ్ళకూరు గ్రామం మార్మోగింది. కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కన్నుల పండువగా స్వామికి సప్తనదుల జలాలతో జలాభిషేకం నిర్వహించారు. స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా దేవస్థానంలో నాలుగు రోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చివరి రోజైన శనివారం స్వామి అమ్మవార్లకు సప్తనదులైన గోదావరి, సరస్వతి, యమునా, గంగా, కృష్ణ, కావేరి, నర్మద నదుల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దంపతులు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సప్తనది జలాలు, పవిత్రాలతో గ్రామంలో శోభయాత్ర నిర్వహించి అష్టోత్తర కలశార్చన గావించారు. అనంతరం శాంతి కల్యాణ మహోత్సవం అష్టోత్తర పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆరేటి వెంకటరత్నప్రసాద్, మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు, డీసీ ఛైర్మన్ గోకరాజు వెంకట శివరామరాజు, వేగేశ్న సత్యనారాయణరాజు, సర్పంచ్ సాధు శ్రీదేవి, ఉపసర్పంచ్ నడింపల్లి ప్రదీప్ రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ దంపతులు







పాలకొల్లు, పెనుగొండల్లో సిద్ధమైన అమ్మవార్ల విగ్రహాలు

కదిలొస్తున్న అమ్మోరు !

- దసరా ఉత్సవాలకు విగ్రహాలు సిద్ధం
- పలు రూపాల్లో ఆకర్షణీయంగా తయారు చేస్తున్న కళాకారులు

పాలకొల్లు అర్బన్/పెనుగొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఇటీవలే వినాయకచవితి ఉత్సవాలు ముగిశాయి. గణనాథులను పలు సెంటర్లలో ఏర్పాటు చేసి పూజలు చేసి పలు వేషధారణలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఇక దసరా సందడి వచ్చేస్తుంది. అక్టోబరు రెండో తేదీ విజయదశమి పురస్కరించుకుని ఈనెల 22వ తేదీ నుంచి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాల్లో పూజలు అందుకునేందుకు అమ్మ వార్ల విగ్రహాలు పలు

గతంలో కంటే ఎక్కువ తయారు చేశాం



అమ్మవార్ల విగ్రహాలు గతంలో కంటే ఎక్కువగా తయారు చేశాం. చుట్టుపక్కల ప్రాంతాలకే కాకుండా రాజోలు, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాలకు వీటిని కొనుగోలు చేసుకునేందుకు అడ్వాన్సు బుక్ చేసుకున్నారు. వీటి తయారీకి హైదరాబాద్, తమిళనాడు నుంచి తయారు చేసే వారిని తీసుకువచ్చి తయారు చేశాం.

- వేంద్ర చంద్రశేఖర్,
తయారీదారుడు, పెనుగొండ,



పెనుగొండలో రంగులు వేస్తున్న కళాకారుడు

రూపాల్లో వస్తున్నాయి. పలు సైజుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను వినియోగించి శిల్పులు తయారు చేస్తున్నారు. పాలకొల్లు పట్టణానికి చెందిన శిల్పులు నరం మోహన వెంకట సత్యనారాయణమూర్తి (నీల్ కమల్ మూర్తి), ఇంటి ప్రసాద్, కత్తుల శ్రీనివాస్, ఇంకా ఇరువురు శిల్పులు అమ్మవార్ల విగ్రహాలను తమతో పాటు నిపుణులైన పనివారితో తయారు చేస్తున్నారు. విగ్రహాల తయారీ పూర్తికాగా రంగులు అద్దుతున్నారు. అర్డర్లపై మాత్రమే విగ్రహాలను తయారు చేస్తున్నట్టు శిల్పులు చెబుతున్నారు. ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండలో విగ్రహాలు తయారు చేయడంతో చుట్టుపక్కల ప్రాంతాలైన పాలకొల్లు, పెనుమంట్ర, మార్టేరు, పెరవలి పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

మూడు అడుగుల నుంచి 15 అడుగుల సైజు వరకు విగ్రహాలను ఆయా కమిటీలు అభీష్టం మేరకు పలు రూపాల్లో తయారు చేసి అందజేస్తామని తెలిపారు. చిన్న సైజు అమ్మవారి విగ్రహం 4 అడుగులు లోపు రూ. 1000, ఆపై 8 అడుగులు విగ్రహం రూ.25వేలు, 10 అడుగుల విగ్రహమైతే రూ.30 వేలు, 15 అడుగులు రూ.40 వేలుకు విక్రయిస్తున్నామన్నారు. సుమారు మూడు నెలల నుంచి విగ్రహాలు తయారు చేయడం ప్రారంభిస్తామని, తమతో పాటుగా తమ వద్ద పనివారు, విగ్రహాలకు రంగులు అద్దే వారు పనిచేస్తారని, అన్ని ఖర్చులు పోనూ పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని నీల్ కమల్ మూర్తి తెలిపారు.



గుబ్బల మంగమ్మ ఆలయంలో విద్యుత్ కాంతులు

గుబ్బల మంగమ్మ ఆలయానికి విద్యుద్దీపాలంకరణ

బుట్టాయగూడెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీగుబ్బల మంగమ్మ ఆలయంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఆలయంలో విద్యుత్ దీపాలతో కమిటీవారు అలంకరించారు. ఈనెల 22 నుంచి ఆలయం వద్ద దసరా మహోత్సవాలను నిర్వహిస్తున్నామని భక్తుల సౌకర్యార్థం అమ్మవారి ఆలయంను ప్రత్యేకంగా అలంకరించారు శనివారం అమ్మవారు భక్తులకు నాగదేవత రూపంలో దర్శనమిచ్చినట్లు తెలిపారు.



మాజీ న్యాయమూర్తి నూతి రామ్మోహనరావుకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు రాజు

చిన వెంకన్నకు మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి దంపతుల పూజలు

ద్వారకాతిరుమల సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల చినవెంకన్న సన్నిధిని మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి నూతి రామ్మోహనరావు దంపతులు శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన దంపతులకు అధికారులు అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. తొలుత న్యాయమూర్తి దంపతులు స్వామిని దర్శించి పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు శ్రీవారి శేషవస్త్రాలు అందజేసి వేద ఆశీర్వచనాన్ని అందించారు. ఆలయ ఆలయ పర్యవేక్షకులు రాజు శ్రీవారు అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.

సోమేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



భీమవరంటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాద్రపద మాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని భీమవరం సోమేశ్వరస్వామికి నక్షత్ర దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. శనివారం ఉదయం స్వామికి ఆలయ అర్చకుడు రామకృష్ణ పర్యవేక్షణలో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పూజలు నిర్వహించి దీపాలంకరణ చేశారు.



పాలకొల్లు క్షీరారామంలో రుద్రహోమం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాసశివరాత్రి సందర్భంగా శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆరుగురు దంపతులు రుద్రహోమం నిర్వహించారు. సాయంత్రం స్వామికి ప్రత్యేక అలంకరణ గావించారు. సాయంత్రం స్వామివారి లీలా కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, అభిషేక పండితులు భమిడిపాటి వెంకన్న, పాలక మండలి ఛైర్మన్ మీసా రాము, ట్రస్టీలు దుర్గా పెద్దిరాజు, నాళం సురేఖ, పి.శ్రీనివాస్, కె.సూరిబాబు, పి.శ్రీదేవి, సింహాచలం, బీఏఎన్ సత్యనారాయణ, వి.కుమారి, నీలాపు మణి, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు 'ఆర్‌టీఎఫ్' కష్టాలు

- బకాయిల చెల్లింపుల్లో జాప్యం



తణుకు చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాల

తణుకు, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం డిగ్రీ కాలేజీలకు చెల్లించాల్సిన రీయింబర్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజులు (ఆర్‌టీఎఫ్) పెద్ద మొత్తంలో పెండింగ్‌లో పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు ఉండడంతో ఇప్పుడు మరింత పెరిగాయి. కోట్ల రూపాయలు బకాయిలు పడడంతో కళాశాల యాజమాన్యాలు కళాశాల నిర్వహణతో పాటు ఉపాధ్యాయుల జీతాలు, ఇతర ఖర్చులు భరించలేకపోతున్నామని యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. తప్పనిసరి పరిస్థితుల్లో కళాశాలల బంద్ చేయాలని పలువురు యాజమాన్యాలు భావించాయి. రానున్న రోజుల్లో దసరా పండగ సెలవులు, రెండో విడత కౌన్సెలింగ్ 24 నుంచి ఉండడంతో ప్రభుత్వం బకాయిలు విడుదల చేస్తుందనే ఆలోచనతో మరో అసోసియేషన్ వేచిచూసే ధోరణిలో తాత్కాలికంగా వాయిదా వేశాయి. మరో అసోసియేసన్ మాత్రం ఈనెల 22 నుంచి కళాశాల బంద్ పాటిస్తున్నట్టు ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు.

బంద్ వాయిదాకు కారణం ఇదే..

మెజారిటీ యూనివర్సిటీలు రెండో విడత డిగ్రీ అడ్మిషన్ ప్రక్రియ పూర్తిచేసుకున్న తర్వాత దసరా సెలవుల తర్వాత సమ్మెలోకి వెళ్లాలని భావించాయి. వాటిలో రెండు యూనివర్సిటీలు మాత్రమే పూర్తిగా బంద్‌కు మద్దతు తెలిపాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు క్లాసులు ప్రారంభం కానందున మొదటి విడద డిగ్రీ అడ్మిషన్ల సీట్లు కేటాయింపు అవ్వగానే క్లాసులు ప్రారంభించాలనే ఒత్తిడి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఉందనే అభిప్రాయం వ్యక్తం చేయడం కారణం. ప్రభుత్వం పెండింగ్ ఫీజులుపై స్పందించకపోతే అక్టోబరు మొదటి వారంలో నిరవధిక సమ్మెలోకి వెళ్లే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని భావిస్తున్నాయి.



- తాత్కాలికంగా సమ్మె వాయిదా వేసిన అసోసియేషన్
- రేపటి నుంచి కాలేజీల బంద్ అంటూ మరో అసోసియేషన్ ప్రకటన

ఉభయ గోదావరి జిల్లాలో 400 కాలేజీలు..

ఆదికవి నన్నయ్య వర్సిటీ పరిధిలోని ఉభయగోదావరి జిల్లాల పరిధిలో సుమారు 400 కళాశాలలు ఉన్నాయి. వాటిలో 4.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ చదువుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,380 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థుల భవిష్యత్.. కళాశాలల ఆర్థిక స్థితిపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఫీజు బకాయిలు భారీగా ఉండడం వల్ల కళాశాలలు యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.4,620 కోట్ల ఫీజు బకాయిలు..

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఫీజు బకాయిలు రూ.4,620 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు రావాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం నుంచి పెండింగ్ పెట్టిన

కళాశాలల యాజమాన్యాలకు తప్పని ఆర్థిక ఇబ్బందులు

బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లించుకుంటూ వస్తుంది. ఇంకా వైసీపీ ప్రభుత్వంలో 2023-24 విద్యా సంవత్సరంలో మూడు క్వార్టర్లకు సంబంధించి ఆర్‌టీఎఫ్ బకాయిలు సుమారుగా రూ. 1,850కోట్లు ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25లో రూ.1,470 కోట్లు, 2025-26 విద్యాసంవత్సరంలో రూ.1,300 కోట్లు కలిపి సుమారుగా రూ.4,620కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఉభయగోదావరి జిల్లాలోని కళాశాలలకు సంబంధించినంత వరకు సుమారు రూ.50 కోట్లకు పైబడి బకాయిలు రావాల్సి ఉన్నాయి.

జేఏసీగా ఏర్పడి ప్రభుత్వంపై ఒత్తిడి



ఆర్‌టీఎఫ్ పరిధిలో ఉన్న అన్ని విద్యాసంస్థలు, ఇంజనీ రింగ్, నర్సింగ్, ఐటీఐ, డిప్లొమా, పాలిటెక్నిక్, డిగ్రీ, కళాశాలలు కలిసి ఐక్య కార్యాచరణ రుపొందిం చుకుని సమష్టిగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం సానుకూలంగా ఉండి బకాయిలు విడుదల చేయకపోతే సమష్టిగా నిరవధిక బంద్‌లో వెళ్లే విధంగా కార్యాచరణ రూపొందిస్తాం.

- ఆర్.రత్నాజీ,
ఏపీ ప్రైవేట్ డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు.

ప్రైవేట్ కాలేజీల భాగస్వామ్యం కీలకం



విద్యార్థులను మార్కెట్ అవసరాలకు తగినట్టుగా తీర్చిదిద్దడంలో ఉన్నత విద్యలో ప్రైవేట్ కాలేజీల భాగస్వామ్యం అత్యంత కీలకం. అంతటి కీలకంగా వ్యవహరించే కాలేజీలు ఆర్థికంగా గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం ఆలోచన చేసి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కళాశాల నిర్వహణ భారంగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

- మహ్మద్ హబీబ్ బాషా, అధ్యక్షుడు, ఆదికవి నన్నయ వర్సిటీ, డిగ్రీ, పీజీ, అనుబంధ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



కళాశాలకు ఉన్న పెండింగ్ ఫీజులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా డిగ్రీ కోర్సుల ఫీజులు సవరించి కొత్త ఫీజులు నిర్ణయించాలి. ఫీజుల బకాయిలతో కళాశాల నిర్వహణ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. తక్షణమే బకాయిలు విడుదల చేయాలి

- గోపిశెట్టి రామకృష్ణ
అపుస్మా జిల్లా జనరల్ సెక్రటరీ


మొక్కలు పెంపకం చేసినట్టు సూచిక బోర్డు.. మొక్కలు లేని దృశ్యం

కానరాని అటవీ మొక్కలు

- 15 హెక్టార్లల్లో ప్లాంటేషన్ వేసినా ఫలితం శూన్యం
- రూ.21 లక్షల నిధులు ఖర్చు.. ఐదుగురికి షోకాజ్ నోటీసులు

కుక్కునూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ కోసం లక్షలాది రూపాయల నిధులు ఖర్చు చేసి చేపట్టిన మొక్కల పెంపకం కార్యక్రమం అనుకున్న ఫలితాలు ఇవ్వకుండా విఫలం చెందినందుకు సంబంధిత అటవీశాఖ సిబ్బందిని బాధ్యులను చేస్తూ ప్రభుత్వం షోకజ్ నోటీసులు జారీ చేసింది. ఇందులో ఒక అటవీశాఖాధికారి, ఇద్దరు డిప్యూటీ రేంజ్ అధికారులు, ఒక ఫారెస్టర్, గార్డ్ ఉన్నారు. మొత్తం ఐదుగురు సిబ్బంది ఉన్నారు. వివరాలివి.. 2022-23లో కుక్కునూరు మండలంలోని అమరవరం అటవీరేంజ్ పరిధిలోని రాయిగూడెం సెక్షన్‌లోని చీపురుగూడెం ప్రదేశంలో మొక్కల పెంపకం జరపాలని అటవీశాఖ నిర్ణయించింది. మొత్తం 15 హెక్టార్లలో తెల్లమద్ది, నెమలినార, తదితర మారుజాతి అటవీ జాతి మొక్కలను పెంచడానికి కంపా సీఏ స్కీమ్ కింద నిధులు కేటాయించారు. ఆ నిధులతో 13 హెక్టార్లలో మొక్కలు నాటిన తరువాత వాటికి నీరందించడం, రక్షణ కోసం కంచెలు వేయడం, జంతువుల నుంచి రక్షణ చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం లక్షలాది రూపాయల నిధులు కేటాయించింది. అటవీమొక్కల పెంపకం ప్రారంభించారు కానీ మొక్కల పెంపకం విఫలమైంది. అప్పటి సిబ్బంది బదిలీకాగా వారి స్థానంలో ఇతర ఉద్యోగులు వచ్చారు. ఈ క్రమంలో ఏడాది క్రితం అమరవరం అటవీరేంజ్ అధికారిణిగా పనిచేసిన ఉద్యోగి దీనిపై అటవీశాఖ ఉన్నతాధికారులకు రిపోర్టు పంపించినట్లు సమాచా రం. ఈమేరక అటవీశాఖ ఉన్నతాధికారులు దాదాపు రూ21లక్షలతో చేపట్టిన మొక్కల పెంపకం వైఫల్యం చెందడంపై ఐదుగురు అటవీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లక్షలాది రూపాయలతో చేపట్టిన మొక్కల పెంపకం ప్రదేశానికి వెళ్లి చూస్తే ఒక్క మొక్క కూడా కానరాని పరిస్థితి నెలకొంది.

'వచ్చే దాళ్వాకు విత్తనాల కొరత రానివ్వం'

పెనుమంట్ర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే దాళ్వాలో రైతులకు విత్తన కొరత కొంతవరకు తీర్చడానికి వీలుగా ఎంటీయూ 1121 ఫౌండేషన్ విత్తనం వచ్చే నవంబరు నాటికి అందుబాటులో ఉంటుందని మార్టేరు వరి పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మార్టేరు పరిశోధన కేంద్రంలో శనివారం ఉదయం టీఅండ్‌వీ శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటితో పాటు దాళ్వాకు అనువైన సన్న గింజ రకం ఎంటీయూ 1282కూడా ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సార్వాలో రైతులు ఎక్కువగా సాగుచేస్తున్న ఎంటీయూ 1318 రకం పంట కాలం పెరిగి పోకుండా ఉండేదుకు సిఫారసు చేసిన 24 కిలోల నత్రజని ఎరువు మూడు దఫాలుగా కాక, రెండు దఫాలుగా వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ రకంపై మానుపండు తెగులు ఎక్కువగా వస్తున్నకారణంగా, చిరుపొట్ట దశలో 50శాతం పూతదశలో ప్రోపికోనజోల్ పంటపై పిచికారీ చేయడం ద్వారా ఈ తెగులను నివారించుకోవచ్చున్నారు.

వర్జీనియా పొగాకు సరాసరి ధర రూ.401

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎల్‌ఎస్ పరిధిలో ఉన్న ఐదు పొగాకు వేలం కేంద్రాలలో వర్జీనియా పొగాకు ధరలు శనివారం నిలకడగా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం-32లో శనివారం కిలో వర్జీనియా పొగాకు ధర గరిష్టంగా రూ.430 ఉండగా, కనిష్ట ధర రూ.200 ఉంది. సరాసరి ధర మాత్రం రూ.401కు వెళ్లింది. శుక్రవారం ఇదే వేలం కేంద్రంలో సరాసరి ధర రూ.374.77 ఉండగా శనివారం రూ.26.23 పెరిగి 401కి చేరింది. పొగాకు రైతులకు మొత్తం అమ్మకాలపై సరాసరి ధర రూ.350కు పైగా పెరిగితేనే రైతులకు లాభం చేకూరుతుంది. గత ఏడాది మొత్తం అమ్మకాలపై సరాసరి ధర రూ.328గా ఉంది. ఈ సంవత్సరం వేలం ప్రారంభం నుంచి ఇప్పటివరకు రూ.300 నుంచి రూ.315కు పెరుగుతూ, తగ్గుతూ వస్తుంది.

మానవ జీవన మనుగడకు ఆధ్యాత్మికత ప్రధానం

- శతాధిక వృద్ధులు శ్రీసంత్ సదానంద గిరి స్వామి


ప్రవచనం చేస్తున్న సదానంద గిరి స్వామి

భీమవరంటౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మానవ జీవన మనుగడకు అధ్యాత్మికతే ప్రధానమని శతాధిక వృద్ధులు, హిమాలయ యోగి శ్రీసంత్ సదానంద గిరి స్వామి మహరాజ్(109) అన్నారు. భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఉద్దరాజు ధర్మరాజు 40వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన అనుగ్రహణ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడు కోవాలని, ఆధ్యాత్మిక చింతన లేని జీవితం వ్యర్థమని అన్నారు. అనంతరం పిప్పళ్ళ ప్రసాద్‌చే ఆధ్యాత్మిక సంకీర్తన కచేరి నిర్వహించారు. మణికంఠ దర్శక త్వం వహించిన 'కాలభైరవి' లఘు నాటకం అందరిని ఆకట్టుకుంది. ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి సత్యవాణి, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీవిశ్వనాథరాజు, ఉద్దరాజు శ్రీనివాస్‌రాజు, డాక్టర్ పీఆర్‌కే వర్మ, డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, డీవీఎస్ చంద్రాజీ, కంతేటి వెంకటరాజు, భక్తులు, ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉద్దరాజు ఫౌండేషన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కె.బాల, చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. కొబ్బరికాయలు కొట్టేదెలా..?



- దసరా సీజన్‌లో కొబ్బరి ధర పైపైకి..
- ధరలు చూసి భక్తుల బెంబేలు
- రిటైల్‌గా రూ. 50కు అమ్మకాలు?
- తమిళనాడులో పంట లేకపోవడమే కారణం?
- ప్రతిరోజూ తెలుగు రాష్ట్రాల నుంచి కోటి కాయలకు పైగా తమిళనాడు మార్కెట్‌కు..

దేశవ్యాప్తంగా పది రోజులు పాటు జరుపుకునే దసరా ఉత్సవాలకు కొబ్బరి ధర భక్తులకు తీరని నిరాశ మిగల్చనుంది. ఉత్సవాలలో కొబ్బరి కాయలు అత్యవసరం. అయితే కొబ్బరి కాయల ధరలు రోజు రోజుకు పెరిగి భక్తులు కొనలేని వస్తువుగా మారిపోయిందనే ఆందోళన నెలకొంది. నెల రోజుల క్రితం రూ. 25 నుంచి రూ. 30లు అమ్మిన కొబ్బరి కాయ నేడు రూ. 40 నుంచి రూ. 50కు చిల్లరగా అమ్ముతున్నారని భక్తులు పేర్కొంటున్నారు.

(తణుకు రూరల్ -ఆంధ్రజ్యోతి)

నెల రోజుల క్రితం వరకూ రైతు వద్ద కొబ్బరికాయ రూ. 15లకు కొనుగోలు చేసిన వ్యాపారులు నేడు రూ. 25 నుంచి 30లకు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. కొబ్బరి కాయలు సాధారణంగా మూడు కేటగిరీలుగా ఉంటాయి. వాటిలో మొదటి రకం రూ. 30, రెండవ రకం రూ. 25, మూడో రకం రూ. 20లుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. వీటిలో మరలా ఎండు కొబ్బరి, బరువు కొబ్బరి రకాలు వుంటాయి. బరువు కొబ్బరి కాయలు దేవుని గుడి వద్ద కొట్టి మొక్కులు తీర్చుకునేందుకు ఉపయోగిస్తారు.

చిల్లరగా రూ. 50?

తణుకు పట్టణంలోని పలు ఆలయాల వద్ద కొబ్బరి కాయ రూ. 50 లుగా అమ్ముతున్నట్లు భక్తులు పేర్కొంటున్నారు. చిల్లర వ్యాపారుల వద్ద మూడు రకాల కొబ్బరి కాయలు అందుబాటులో ఉన్నప్పటికీ దేవుడుకి ఖరీదైన కాయలనే సమర్పించాలని భక్తులు భావిస్తారు. దీనిని వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు కృత్రిమ కొరత సృష్టిస్తారని భక్తులు అంటున్నారు.

తమిళనాడుకు ఎగుమతుల వల్లే..

కొబ్బరి తమిళనాడులో ఎక్కువగా పండుతుందని, అక్కడ ఈ ఏడాది దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో రాష్ట్రంలో కొబ్బరి ధరలు గణనీయంగా పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. తమిళనాడులో మొత్తం 13 జిల్లాల్లో కొబ్బరి పంట పండిస్తూ దేశంలో ఎక్కువ కొబ్బరిని ఉత్పత్తి చేస్తుందని, మన రాష్ట్రంలో మూడు జిల్లాలు, తెలంగాణాలో ఖమ్మం జిల్లాలోనే కొబ్బరి పంట ఎక్కువగా పండుతుంది. ఏపీ, తెలంగాణా నుంచి రోజుకు కోటి కొబ్బరి కాయలు చెన్నై కేంద్రంగా జాతీయ మార్కెట్‌కు తరలివెళ్తున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. అందువల్ల ఇక్కడ ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. దసరా వేడుకల సమయంలో ధరలు పెరగడం భక్తులకు భారంగా మారింది.

కృత్రిమ కొరతను అరికట్టాలి...



తమిళనాడులో సంక్షోభాన్ని చూపి తెలుగు రాష్ట్రాల్లోని వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి విజయ దశమి సందర్భంగా భక్తులపై ధరల భారాన్ని మోపే ప్రమాదం వుంది. ప్రభుత్వ యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా దసరా వేడుకల సమయంలో భక్తులకు కొబ్బరి కాయల కొరత లేకుండా చూడాలి.
-మల్లిన రాధాకృష్ణ., మున్సిపల్ మాజీ కౌన్సిలర్, తణుకు.

నలుగురు ఎన్‌సీసీ ఆఫీసర్లకు పదోన్నతి


పదోన్నతి పొందిన ఆఫీసర్లతో ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పదవీకాలంలో ర్యాంకు/పదోన్నతి పొందిన ఎన్‌సీసీ ఆఫీసర్లకు పిన్‌లను యూనిఫాంపై ధరింపజేసేందుకు నిర్వహించే పిప్పింగ్ వేడుక శనివారం 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్‌పాండే ఆధ్వర్యంలో ఏలూరులోని జిల్లా కార్యాలయంలో జరిగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 4 విద్యాసంస్థల ఎన్‌సీసీ యూనిట్ల అధికారులు.. మేజర్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ ఎ.వీరయ్య (భీమవరం డీఎన్నార్ కళాశాల), కెప్టెన్‌గా పదోన్నతి పొందిన కె.శివశంకర్ (శ్రీ వెంకటేశ్వర కళాశాల, భీమడోలు), కెప్టెన్ ఎల్.సుందరీబాయి (ఎస్కేఎస్డీ మహిళా కళాశాల), ఫస్ట్ ఆఫీసర్ పదోన్నతి పొందిన ఎస్.రామయ్య (ఏలూరు, కేపీడీటీ హైస్కూలు)కు వారి పదోన్నతులను తెలియజేసే పిన్‌లను యూనిఫాం దుస్తులపై సీవో ధరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా వేలమంది ఎన్‌సీసీ కేడెట్లకు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న వీరందరికీ ప్రమోషన్లు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఎక్కువమంది కేడెట్లను జాతీయ స్థాయి ప్రదర్శనల్లో పాల్గొనేలా తర్ఫీదు నివ్వాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో 19 ఆంధ్రా బెటాలియన్ ఔన్నత్యానికి కృషి చేయాలన్నారు. సీనియర్ డివిజన్ ఆఫీసర్లు, సీనియర్ వింగ్ ఆఫీసర్లు, పీఐ స్టాఫ్ పాల్గొన్నారు.

24 లేదా 25న డీఎస్సీ ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత?

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని ఈ నెల 24 లేదా 25 తేదీల్లో అమరావతిలో నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ నెల 19న జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి పశ్చిమలో ఉద్యోగాలకు ఎంపికైన మొత్తం 1146 మంది అభ్యర్థులను అమరావతిలో నిర్వహించతలపెట్టిన నియామకపత్రాల అందజేతకు పంపించేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను చేసింది. ఏలూరులోని 10 పాఠశాలలను ఎంపిక చేసి, వాటిలో డీఎస్సీ అభ్యర్థులకు వసతి, ప్రయాణ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకుగాను మొత్తం 350 మంది ఎంఈవోలు, హెచ్‌ఎంలు, సీనియర్ టీచర్లు, వ్యాయామ విద్య ఉపాధ్యా యులకు బాధ్యతలు అప్పగించింది. ఆ మేరకు అభ్యర్థులు ఏలూరు చేరుకోవడానికి ఈ నెల 18న ఉదయం ఆయా ప్రాంతాల నుంచి బయలు దేరనున్న సమయంలో ఉదయం 8.30 గంటలకు వాయిదా సమాచారం అందటంతో ఎక్కడివారక్కడే ఉండిపోయారు. వాయిదా నిర్ణయంపై పలు ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలోనే తాజాగా ఈ నెల 24 లేదా 25న నియామకపత్రాల అందజేతను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. దీనిపై శనివారం వరకు అధికారిక ప్రకటన లేదు.

మైనార్టీ యాజమాన్య పాఠశాలలకు.. 27 నుంచి దసరా సెలవులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు దసరా సెలవులపై డీఈవో వెంకట లక్ష్మమ్మ శనివారం స్పష్టతనిచ్చారు. మైనార్టీ మేనేజ్‌మెంట్‌లో నిర్వహిస్తోన్న పాఠశాలలకు అకడమిక్ కేలండర్‌లో ప్రకటించినట్టుగా ఈ నెల 27 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సెలవులుంటాయని, మిగిలిన అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు సెలవులుంటాయని వివరణ ఇచ్చారు. అన్ని పాఠశాలల్లో అక్టోబరు 3 నుంచి తరగతులు యథాతథంగా జరుగుతాయని, ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ నుంచి ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లోకి మారిన అన్ని పాఠశాలలకు ప్రభుత్వ యాజమాన్య సెలవులే వర్తిస్తాయని స్పష్టం చేశారు.


పోలవరం ప్రాజెక్టు రోడ్డులో మరమ్మతులకు గురైన బల్కర్

ప్రాజెక్టు రోడ్డు గోతిలో ఇరుక్కున బల్కర్

రెండు గంటలపాటు నిలిచిన ట్రాఫిక్

పోలవరం సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు ముఖ ద్వారం వద్ద ఉన్న భారీ గోతిలో శనివారం భారీ సిమెంట్ బల్కర్ అడుగు భాగం నేలకు తగిలి కమాన్ కట్టలు విరిగిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలవరం నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి ప్రాజెక్టుకి వెళ్ళే రోడ్డు మార్గంలో ప్రాజెక్టు చెక్‌పోస్టు వరకూ అడుగడుగునా భారీ గోతులు ఉండడంతో తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు ముఖద్వారం వద్ద భారీ వాహనాల సంచారంతో రోడ్డు కిందికి దిగిపోయి భారీ వాహనాలు, కార్ల అడుగుభాగం నేలకు తగిలి మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు తక్షణం రహదారి నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గేదెల కోసం ప్రాజెక్టులోకి దిగి ఒకరి మృతి

టి.నర్సాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):గేదెల కోసం ప్రాజెక్టులో దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు.కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గోనే జయరాజు(25) 15ఏళ్ల నుంచి టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం శివారు సూరంపూడికి చెందిన వరికూటి మంగయ్య గేదెలను కాస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 19న ఎప్పటి లాగే ఉదయం సూరంపూడి శివారులో ఎర్రకాల్వ ప్రాజెక్టు వద్దకు గేదెలను తోలుకుని వెళ్లి సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతుకుతుండగా ప్రాజెక్టులోపాల నీటిలో చనిపోయి కనిపించాడు. గేదెలు ప్రాజెక్టు నుంచి బయటకు రాకపోవడంతో తోలుకుని రావడానికి దిగి ప్రమాదవశాత్తు చనిపోయినట్టు ప్రాథమికంగా గుర్తించారు. సోదరి కోరం ఏసుమణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు.

విద్యార్థిని మోసగించిన యువకుడిపై కేసు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి రెండు సార్లు గర్భవతిని చేసి అబార్షన్ చేయించాడని, ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని కోరితే ముఖం చాటేస్తున్నాడంటూ ఓ విద్యార్థిని పోలీసులను ఆశ్రయించింది. ఏలూరు రూరల్ మండలానికి చెందిన విద్యార్థిని(20)నర్సింగ్ కళాశాలలో చదువుతోంది. ఏలూరు సత్యనారాయణపేటనకు చెందిన తిర్రి దుర్గానరేశ్(24) ఆ యువతిని మూడేళ్ల నుంచి ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మందుబిళ్లలు వాడించి విచ్ఛిన్నం చేశాడు. పెళ్ళి చేసుకోవడానికి ఇప్పుడు నిరాకరించడంతో బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ నాగబాబు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


ఎరువుల దుకాణం పరిశీలిస్తున్న అధికారులు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లిలో పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్ రెవెన్యు వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా విజయ ట్రేడర్స్, సాధు ట్రేడర్స్, స్వర్ణాంధ్ర ఎరువులో డిపోలు ఆకస్మిక తనిఖీలు చేశారు. విజయ ట్రేడర్స్‌లో లైసెన్స్ లేకుండా రూ.3,52,113 రూపాయల విలువైన 3.631 టన్నుల ఎరువులను అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. షాపు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. గతంలో ఉన్న లైసెన్స్ రెన్యువల్ చేయలేదన్నారు. సాధు ట్రేడర్స్‌లో రూ.1.89,410 విలువైన 19టన్నుల ఎరువులు నిల్వల్లో వ్యత్యాసం ఉండటాన్ని అధికారులు గుర్తించారు. విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, ఎస్.ఐ. సీహెచ్.రంజిత్ కుమార్, మండల వ్యవసాయాధికారి కాళింగ గంగాధరం, వీఆర్వో బాషా ఉన్నారు.

విద్యుదాఘాతంతో వలంటరీ ఉద్యోగి మృతి

ఆకివీడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వలంటరీ విశ్రాంత ఉద్యోగి మరణించాడు. ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన దేవులూరి సత్యనారాయణ బీఎస్ఎన్ఎల్‌లో లైన్‌మెన్‌గా పనిచేసి వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. శనివారం ఆకివీడు మండలం చినకాపవరంలో విద్యానికేతన్ స్కూల్ ఎదురుగా కరంటు స్తంభం ఎక్కి నెట్ కేబుల్‌ను కడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి చూపించగా మరణించినట్టు వైద్యుడు తెలిపాడు. వరుసకు కుమారుడైన శేషగిరి ఫిర్యాదు మేర హెడ్ కానిస్టేబుల్ జె.నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు.

వేర్వేరు కారణాలతో ఐదుగురి ఆత్మహత్య



ఏలూరు క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో వివిధ ప్రాంతాల్లో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. తెచ్చిన అప్పులు కట్టలేక,అనారోగ్య సమస్యలు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన వి.పోతురాజు(32)త్వరగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో రూ.రెండు వడ్డీకి డబ్బులు తెచ్చి తిరిగి చెల్లించే మార్గంలేక అప్పులపాలైన మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వి.పోతురాజు ఏలూరులో చెప్పులు కుట్టుకుని జీవనాన్ని సాగిస్తున్నాడు. వివాహం కాలేదు. ఏలూరులోని కొంతమంది దగ్గర రూ.రెండు వడ్డీకి దాదాపు రూ.ఐదు లక్షలు తీసుకొచ్చి రూ.5 వడ్డీకి ఇతరులకు ఇచ్చేవాడు. వారిలో కొందరు ఇచ్చి కొందరు ఇవ్వకపోవడంతో అతను అప్పుల పాయ్యాడు. అప్పులు తీర్చేమార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది ఈ నెల 6వ తేదీన పురుగుల మందు తాగడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకొచ్చారు. ఇంటి వద్ద మృతి చెందాడు.

అప్పుల బాధ భరించలేక..



అప్పుల బాధ భరించలేక ఒక యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తంగెళ్లమూడి భారతీ నగర్‌కు చెందిన కొమరి పార్థసారథి(25) తాపీ పనులు చేస్తూ భార్యతో జీవిస్తున్నాడు. వారికి ఇంకా సంతానం కలగలేదు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం చిన్నచిన్న అప్పులు చేశాడు. అవి తీర్చేమార్గం కానరాక జీవితంపై విరక్తి చెందిన ఈనెల 19వ తేదీ రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు.

బిడ్డ అనారోగ్యాన్ని భరించలేక..



రక్తకణాలు తగ్గి అనారోగ్యంతో బిడ్డ పడుతున్న వేదనను ఆ తల్లి చూడలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. జంగా రెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన బేతాళ దివ్య(23)కు భర్త శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. కుమారుడు సాయివర్ధన్‌కు అనారోగ్యంగా ఉండడంతో జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారు. ఈనెల 19న సీఎం సహాయ నిధికి దరఖాస్తు కూడా చేశారు. తన బిడ్డ పడుతున్న బాధను చూడలేక దివ్య జంగారెడ్డిగూడెంలోని వెంకటేశ్వరస్వామి మెట్ట వద్దకు వెళ్లి పురుగుల మందుతాగి తన కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు వెంటనే ఆమెను జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి..

ఏకారణమో తెలియదు కాని ఒక వ్యక్తి పురుగుల మందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దెందులూరు మండలం గాలాయిగూడేనికి చెందిన ఉండ్రాజవరపు కనకరాజు(45)కు భార్య కొన్నేళ్ళ క్రితం మరణించింది. ముగ్గురు పిల్లలున్నారు. ఏ కారణమో తెలియదు కాని ఈ నెల 19వ తేదీన కనకరాజు పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది..

అనారోగ్యంతో బాధపడుతున్న ఒక యువకుడు జీవితంపై విరక్తిచెంది మందుబిళ్లను నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కైకలూరులోని చింతలచెరువు ప్రాంతానికి చెందిన కొరపాటి వజ్ర(33)కి వివాహం కాలేదు. అనారోగ్యంతో ఉండడంతో వైద్యుడి వద్దకు వెళ్లగా కొన్ని రకాల మందులు ఇవ్వడంతో ఈనెల 19న రాత్రి తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా శనివారం ఉదయం మృతి చెందాడు. కైకలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి ఈ ఐదుగురి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు.

మహిళలకు అండగా శక్తి టీమ్

విద్యార్థినులకు అవగాహన కల్పించిన ఏఎస్పీ సూర్యచంద్రరావు



ఏలూరు క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు, మహిళలు అధైర్య పడాల్సిన అవసరం లేదని వారికి అండగా శక్తిటీమ్ ఉందని ఏలూరు జిల్లా ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు భరోసా ఇచ్చారు.ఏలూరు అమీనాపేటలో శ్రీసురేశ్ చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం పోలీస్ పాఠశాల, సర్‌సీఆర్‌రెడ్డి బీ-ఫార్మసీ కళాశాలల్లో శనివారం శక్తి టీం ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కల్పించారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్ర రావు పాల్గొని విద్యార్థినులతో అవగాహన కల్పించారు. తమ ఫోన్లలో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా పోలీసుల భద్రత వారి వెంటే ఉంటుందన్నారు. శక్తియాప్ ద్వారా ప్రమాదంలో ఉన్నప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చే ఆప్షన్ ఈ యాప్‌లో ఉందని ఎస్ఓఎస్ ఆప్షన్ ద్వారా నేరుగా పోలీసులను వీడియోకాల్లోనే సంప్రదించవచ్చని జీపీఎస్ లొకేషన్ కూడా ట్రాకింగ్ చేయవద్దని తెలిపారు. సైబర్ నేరాలపై ఈ యాప్ ద్వారా అవగాహన పొందవచ్చన్నారు. ఎమర్జెన్సీ సమయాలలో అత్యవసర నెంబరు 112, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 181 ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండా పాఠశాలలు, కళాశాలలు ముగించే సమయంలో శక్తి టీం బృందాలు ప్రత్యేకంగా ఆ కళాశాల పాఠశాల ప్రాంతాలలో గస్తీ తిరుగుతూ విద్యార్థులకు భద్రత కల్పిస్తుందన్నారు. వసతి గృహాలకు వెళ్ళే విద్యార్థులను వసతి గృహాల వరకు శక్తి టీం సిబ్బంది వదిలిపెడుతున్నారన్నారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌లపై మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగమణి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగమణి, శక్తి టీమ్ సిబ్బంది, సురేశ్ బాబు పాఠశాల హెచ్‌ఎం స్రవంతి బి.ఫార్మసీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసి బంగారం అపహరణ


ఘటనా స్థలం పరిశీలిస్తున్న ఎస్పీ నయీం అస్మి.. గాయపడిన మహిళ

మొగల్తూరు. సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒంటిరిగా ఇంట్లో ఉన్న మహిళపై కర్రలతో దాడి చేసి ఆమె మెడలోని బంగారు గొలుసు, చెవి దిద్దులు దొంగిలించుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించి మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం కాళీపట్నం తూర్పులో బళ్ళ సూర్య ఆదిలక్ష్మి అనే మహిళ ఒక్కతే ఇంట్లో ని వసిస్తోంది. అమె భర్త లేకపోవడంతో గ్రామంలో చిరు వడ్డీ వ్యాపారం చేసుకుని ఒంటరిగా జీవి స్తోంది. తన ఇంట్లోని కలప అమ్మడానికి గ్రామా నికి చెందిన మారం శ్రీనివాస్‌ను ఇంటికి పిలి పించగా శనివారం ఉదయం ఇంట్లో అమె శ్రీని వాస్‌కు కలప చూపిస్తోంది. ఇదే సమయంలో శ్రీనివాస్ ఆదిలక్ష్మిపై కర్రతో తలపై బలంగా కొట్టాడు. ఆమె తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలో పడిపోయింది. ఆమె మెడలోని బంగారు చైన్, చెవి దిద్దులను శ్రీనివాస్ అపహరించుకుపోయాడు. తీవ్ర గాయాలపాలైన ఆదిలక్ష్మిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. బాధితురాలి సోదరుడు కోటిపల్లి మార్కెండేయులు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి ఎస్పీ నయీం అస్మి, డీఎస్పీ శ్రీవేద, సీఐ దుర్గా ప్రసాద్‌లు చేరుకుని జరిగిన ఘటనపై విచారించారు.

మహిళల ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం

పెదవేగి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సమాజం రూపొందుతుందని పెదవేగి సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఒక మహిళ ఆరోగ్యంతో ఉంటే ఆ కుటుంబం మొత్తం సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటుందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రత్యూష, తాతా సత్యనారాయణ, సంధ్య, భవానీ, సీడీపీవో ఫాతిమా పాల్గొన్నారు.

వీరంపాలెంలో వర్షపు నీరు తరలింపు

కామవరపుకోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సాగిపాడు పంచాయతీలోని వీరంపాలెంలో వర్షపునీరు చెరువులకు మళ్లేలా ఎక్స్‌కవేటర్‌తో శనివారం పనులు చేపట్టారు. ఇదే తరుణంలో శ్మశానవాటికను శుభ్రపరిచారు. దీంతో గ్రామంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారి బాణావతు బాలాజీ, టీడీపీ నాయకులు కిలారు సత్యనారాయణ, గ్రామ రెవెన్యూ పరిపాలనాధికారి కె.వెంకన్నబాబు, జిజ్జూరి బాబ్జి, కొమ్మిన నవీన్‌కృష్ణ, కమ్మ శ్రీనివాసరావు, గుల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

టి.నర్సాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షులుగా బొద్దుల గంగాభవాని, కార్యదర్శిగా బొడ్డపాటి రాజులను మండల మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ సంఘ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడెల్లి వెంకట్రావు తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో అనేక సమస్యలు నెలకొన్నాయని రోడ్లు, డ్రెయినేజీలు, ఇళ్ల స్థలాలు, పట్టాలు వంటి సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయని అన్నారు. ఉపాధి హామీ పని ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరంతరం పని చేసేలా నూతన కమిటీ ముందుకు నడవాలని కోరారు. గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం కమిటీ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ మహాసభలో మండల ఉపాధ్యక్షులుగా కలపాల గాంధీ, సహాయ కార్యదర్శిగా కలపాల చెల్లమ్మ, చిరమయ్య, కొత్తా ముత్యాలరావు, కుంజా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):స్థానిక బావిశెట్టివారిపేటలోని దేవదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీకనకదుర్గాంబ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు, ఆలయ అర్చకులు యడవల్లి శ్రీహరిశర్మలు తెలిపారు. ఈఉత్సవాల్లో అమ్మవారికి ప్రతీరోజు ప్రత్యేక అలంకరణ జరిపి భక్తులతో సామూహికంగా కోటి కుంకుమార్చనలు జరుపుతామని తెలిపారు. సోమవారం అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తారని తెలిపారు.

శ్రీదేవి ఆలయంలో ఉత్సవాల పర్యవేక్షణ..

అంబికా సంస్థల అధినేత అంబికా రాజా శనివారం స్థానిక సత్రంపాడులోని అంబికాదేవి ఆలయం వద్ద సోమవారం నుంచి జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ అంబికా రాజా గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ సహాయ అర్చకులు శ్రీనివాసుల శ్రీనివాసాచార్యులు, కపిల శివశంకర్ ప్రసాద్ శర్మ, ఆలయ మేనేజర్ ఉన్నారు.

27 మంది బ్యాంకు ఉద్యోగుల రక్తదానం



ఏలూరు క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరులోని సత్రంపాడులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో 27 మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేసినట్లేనని అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు అభినందనలు తెలిపారు. విజిలెన్సు ఇన్‌ఛార్జి బి.హరీష్, రీజినల్ మేనేజర్ యు.శ్రీదేవి, వరప్రసాదరావు, పీఆర్‌వో కె.వి.రమణ పాల్గొన్నారు.

పేదలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయండి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భర్తను కోల్పోయిన ఒంటరిగా ఉంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద మహిళలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేసి నెలకు 35 కేజీల బియ్యం అందించాలని కేవీపీఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు.అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం ఏజెన్సీ దళిత ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో పేదలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ మహిళల కోసం అనేక వాగ్దానాలు చేసిందని, అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. పేదలను గుర్తించి అంత్యోదయ కార్డులు మంజూరుచేసి నెలకు 35 కేజీల బియ్యం షాపుల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పివి చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. అన్నపూర్ణ, సావిత్రి, మరియమ్మ, సూరమ్మ, బాయమ్మ, లలిత, రాధా, మార్త, బేబి, రాణి పాల్గొన్నారు.

పెదవాగు ప్రాజెక్టుకు మరమ్మతులు చేయండి

వేలేరుపాడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత ఏడాది జూలైలో వచ్చిన భారీ వరదల కారణంగా పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోయి ఏడాది దాటుతున్న ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి ఎస్.కే.గౌస్ అన్నారు. శనివారం మేడేపల్లి గ్రామంలో ఆయకట్టు రైతులతో సదస్సు నిర్వహించారు. రైతులను ఉద్దేశించి గౌస్ మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో మేడేపల్లి, రామవరం, పంచాయతీలోని 20 గ్రామాల్లో ఆస్తినష్టం జరిగిందన్నారు. పెదవాగు ప్రాజెక్టు గండిపూడ్చకపోవడంతో గత ఏడాది రైతులు పంటలు వేసుకోలేకపోయారని వాపోయారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రా, తెలంగాణ ప్రభుత్వాలు స్పందించి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు సిరికొండ రామారావు, ముత్యాలరావు, కట్టం రాంబాబు, మేడేపల్లి, నాళ్లవరం ఎంపీటీసీలు తమ్మయ్య, రత్తమ్మ, ఎస్‌కే మున్నీ పాల్గొన్నారు.

కుక్కునూరులో ఉపాధ్యాయులను నియమించండి

కుక్కునూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా కుక్కునూరు మండలంలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యకుంటుపడిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీ.శివ ఆరోపించారు. శనివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఖాళీగా ఉన్న వందలాది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు విద్య అందక ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న విధంగా ఉందన్నారు. డీఎస్సీ అభ్యర్థుల నియామకం ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో ముందుగా ఏజెన్సీ ప్రాంతమైన కుక్కునూరు మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కారం దారయ్య, కొన్నే లక్ష్మయ్య, వీ.శ్యామల, ఐ.సురేశ్‌బాబు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన కళాకృతులతో ఉపాధ్యాయులు

మట్టితో శరీరభాగాల ఆకృతి

లింగపాలెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగగూడెం మోడల్ స్కూల్ విద్యార్థులు మట్టితో శరీరభాగాలు జీవకళ ఉట్టిపడేలా తయారు చేసి తమలోని నైపుణాలను, సృజనాత్మకతను వెలికితీశారు. మట్టితో మానవ మూత్రపిండాలు, గుండె బాగాలను తయారుచేసి వాటిని రంగు లతో అలంకరించారు. బోధన, అభ్యసనా సామగ్రి రూపకల్పనలో భాగంగా తయారు చేసిన మట్టి నమూనాలను శనివారం పాఠశాలలో ప్రదర్శించారు. విద్యార్థులను హెచ్‌ఎం పువ్వుల అంజనేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తల్లిదండ్రుల పేరిట మొక్క నాటండి

(5వ పేజీ తరువాయి)

పనిచేయాలన్నారు. రైతు మోరంపూడి మల్లికార్జునరావు పొలంలో వరి పంటకు డ్రోన్ ద్వారా నానో ఎరువుల పిచికారీని పరిశీలించారు. నానో ఎరువులు, డ్రోన్‌ల వినియోగంతో సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. జిల్లా వ్యవసాయాధికారి, షేక్ హబీబ్‌బాషా, డీపీవో అనురాధ, డీఎల్‌డీవో పి.వెంకటరత్నం, తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో కె.వాణి, పలు శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ!

(5వ పేజీ తరువాయి)

వేంకటేశ్వరస్వామి గుడి వద్ద,తంగెళ్లమూడి, వన్‌టౌన్ ఏరియాల్లో నాలుగు క్యాంటీన్లు ప్రారంభించారు. అన్న క్యాంటీన్లకు అక్షయపాత్ర ఆహారం సరఫరా చేస్తోంది. మంచి రుచి, నాణ్యతతో కూడిన ఆహారం అందించడంతో కూలీలు, ఆటో డ్రైవర్లు, చిరువ్యాపారులు, దూరప్రాంతాల నుంచి వచ్చే పేదలు వీటిని ఆశ్రయిస్తున్నారు.

తరచూ అధికారులు తనిఖీలు : వారంలో మూడు, నాలుగు రోజుల పాటు నగరపాలక సంస్థ కమిషనర్ ఈ క్యాంటీన్లను తనిఖీ చేస్తూ ఆహార పదార్థాల నాణ్యత, రుచి ఎలా ఉన్నాయో తెలుసుకుంటున్నారు. అక్కడ సిబ్బందిని పరిసర ప్రాంతాలన్నీ పరి శుభ్రంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. శుక్రవారం కలెక్టర్ వెట్రిసెల్వి స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న అన్న క్యాంటీన్ సందర్శించి రుచికరమైన ఆహార పదార్థాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.



భీమడోలులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పారిశుధ్య కార్మికులకు ప్రోత్సాహకం అందిస్తున్న ఎమ్మెల్యే చంటి



పోతునూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

మొక్కలు నాటండి..

» స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా అధికారుల పిలుపు » పాల్గొన్న నాయకులు

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా 33, 34వ డివిజన్లలో నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ స్వచ్ఛత కోసం ప్రతిజ్ఞ చేస్తే చాలదని ప్రజలంతా భాగస్వాములు అవ్వాలన్నారు. అనంతరం నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి కృష్ణా కాల్వ గట్టుపై మొక్కలు నాటారు. పరిశుభ్రతలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పారిశుధ్య సిబ్బందికి రూ.5వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వాతావరణానికి పరిసరాల పరిశుభ్రత అవసరమన్నారు. నగర కమిషనర్ భానుప్రతాప్, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, టీడీపీ నాయకులు పిలారిశెట్టి సంధ్యా, సురేశ్, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, డీ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: ఏలూరు పత్తేబాదలోని రెడ్‌క్రాస్ నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో రెడ్‌క్రాస్, మానవత సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ ఏలూరు కార్యక్రమాన్ని నిర్వహించినట్టు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి ప్రసాద్ తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, ఎ.నిర్మల, ఉత్తమ దుర్గ, ఎం.అజయ్‌బాబు, ఏలూరు మానవత అధ్యక్షుడు ఎంఎస్ఎంఎస్ కుమార్, రత్నాకర్‌రావు, గోపాలకృష్ణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు:మండలంలోని స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో పద్మావతి దేవి సూచించారు. శనివారం భీమడోలులో చేపట్టిన అవగాహన ర్యాలీని ఎంపీడీవో ప్రారంభించారు.

● పెదవేగి: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా పెదవేగి సొసైటీ అధ్యక్షుడు తాతా సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రవి కుమార్, ఈవోపీఆర్డీ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ ఆలీ, సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, కార్యదర్శి కె.వరప్రసాద్ పాల్గొన్నారు.

● పోలవరం: పోలవరం మండలం కొత్తపట్టిసీమ పంచాయతీలో శనివారం సర్పంచ్ మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటారు. డిప్యూటీ ఎంపీడీవో ఎల్.రవికుమార్, సచివాలయ, అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ఏలూరుఅర్బన్: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మోతేవారితోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆడ పిల్లలను చదవనివ్వాలని, లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే స్కానింగ్ సెంటర్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రోహిత్, వైద్యాధికారిణి మానస,అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● చింతలపూడి: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అధికారులు మొక్కలు నాటారు. ఎంపీడీవో కామేశ్వరి మాట్లాడుతూ మొక్కలు నాటి పరిరక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీపీ రాంబాబు పాల్గొన్నారు.

● దెందులూరు: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా పోతునూరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు బోడ్డేటి మోహన్‌బాబు, టీడీపీ గ్రామాధ్యక్షుడు నున్న లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి బాయి రాంప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు చలసాని రాంబాబు, తలారి ధన్యకుమార్, తోటసురేశ్, అప్పారావు, సర్పంచ్ బోదుల నాని పాల్గొన్నారు. దెందులూరులో గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, కలపాల శ్రీహరి, సంపెంగ తిలక్, మహేష్ యాదవ్, తోట యేసమ్మలు మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న కొత్తపట్టిసీమ సర్పంచ్ విజయదుర్గ

● కుక్కునూరు: నల్లకుంట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బీజేపీ నాయకులు వాడపల్లి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పిచ్చిమొక్కల తొలగిస్తూ స్వచ్ఛభారత్ నిర్వహించారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా వచ్చే నెల 2 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు లక్ష్మణాచార్యులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించిన ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. ప్రతి ఒక్కరూ చెట్టు నాటి పెంచాలన్నారు. పలు శాఖల అధికారులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: కొండగూడెం సచివాలయం పరిధిలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ నిర్వహించారు. గ్రామంలో చెత్త తొలగింపు ప్రక్రియ, బ్లీచింగ్ చల్లించడం, చెట్లను నాటడం కార్యక్రమాలను నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ ఉప సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ, సర్పంచ్ కరిపోతు అనూష, పంచాయతీ కార్యదర్శి బి.రవినాయక్ పాల్గొన్నారు.

● దెందులూరు: బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ, పార్టీ మండలాధ్యక్షురాలు చీకటి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో సేవా పక్వాడా స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ప్రభు చౌదరి, మండూరి బుజ్జీ గోపాల్, శేఖర్, చింతాడ వెంకటన్న నాయకులతో కలిసి ఆలయాన్ని శుభ్రం చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో పరిసరాలను పిచ్చి మొక్కలు తొలగించారు. వీర్రాజు, సత్యనారాయణ, ఏసోబు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. గాలాయగూడెంలో బీజేపీ జిల్లా నాయకులు, బ్యాంక్ డైరెక్టర్ మండూరి బుజ్జీ గోపాల్ మొక్కలు నాటారు.



పుస్తకాలతో విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

టి.నర్సాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ ప్రవేశపరీక్షకు విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా సన్నద్ధం కావాలని బొర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి జూడాల వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సుమారు 25మంది విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు కావల్సిన విద్యాసామగ్రిని పాఠశాల పూర్వవిద్యార్థి జూడాల వెంకటేశ్వరరావు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. హెచ్ఎం అహ్మద్ అలీ, ఎస్ఎంసీ చైర్మన్ రమేశ్, ఉపాధ్యాయులు సౌజన్య, దీప, ఈశ్వరి, నాగపల్లవి, శ్రీను, ప్రభాకరరావు, పాల్గొన్నారు.

శ్రీవారికి విశేష అర్చనలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భాద్రపద మాసంలోని ఆఖరి శనివారం కావడంతో రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించారు. తులసీ దళాలు, పుష్పాలతో స్వామివారికి అర్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థ, అన్నప్రసాదాలు స్వీకరించారు.ఆలయ కమిటీ వారు భక్తులకు మహా అన్నప్రసాద వితరణను నిర్వహించారు. ఆలయ ఈవో నల్లూరి సతీశ్ కుమార్, సిబ్బంది గంగాధరరావు, శ్రీనివాసరావు మిత్రబృందం భక్తులకు తగు సేవలందించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచండి

» జంగారెడ్డిగూడెంలో అవగాహన ర్యాలీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ మున్సిపల్ కమిషనర్ కెవి.రమణ మాట్లాడుతూ పట్టణంలో పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామ్‌కుమార్, మహంకాళి రామ్మోహనరావు, చెరుకూరి శ్రీదర్, తూటిగుంట దుర్గారావు, గుమ్మడి ప్రసాద్, షేక్ యాకూబ్, బీజేపీ బ్రహ్మాజీ పాల్గొన్నారు. మండలంలోని లక్కవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి కొండలరావు అధ్యక్షతన పచ్చదనం-పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గెల్లా వెంకటరమణ పాల్గొన్నారు.

నూతన ఇ-పోస్ యంత్రాల పంపిణీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలకు చెందిన రేషన్ దుకాణాల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈపోస్ యంత్రాలను రోటరీ కమ్యూనిటీ హాల్లో రేషన్ డీలర్లకు సివిల్ సప్లై అధికారుల సమక్షంలో శనివారం అందజేశారు. జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, టీనరసాపురం, కొయ్యలగూడెం పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలలోని 272 రేషన్ దుకాణాలకు నూతన ఈపోస్ యంత్రాలను అందజేశారు. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నూతన సాంకేతికతో ఈ పోస్ యంత్రాలను రేషన్ డీలర్లకు అందజేశారు. పదేళ్ల అనంతరం మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఈ పోస్ యంత్రాలను పంపిణీ చేయడం విశేషం. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, రేషన్ డీలర్ల ద్వారా నూతన స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. సివిల్ సప్లై డీటీలు జి.వెంకటేశ్వరరావు, రామారావు, వెంకట రమణ, శేషగిరి, సిఎస్ఆర్‌ఐ పద్మావతి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు పఠాన్ అన్వర్ బాషా, ఆయా మండలాల డీలర్లు పాల్గొన్నారు.



నూతన యంత్రాలు అందజేస్తున్న అధికారులు



మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

అక్షరాంధ్రను విజయవంతం చేయండి

టి.నర్సాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జీసీహెచ్ ప్రభాకరరావు తెలిపారు. టి.నర్సాపురంలోని మూడు అక్షరాంధ్ర కేంద్రాలను శనివారం సందర్శించి అభ్యాసకులకు పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆర్.విజయ్ కుమార్, వలంటరీ టీచర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గురజాడ జీవితం స్ఫూర్తిదాయకం

కామవరపుకోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు జీవిత చరిత్రను, ఆయన కవిత్వం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌కు చెందిన ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె.రత్నశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కె.విజయబాబు సూచనతో కళాశాల విద్య అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు అధ్యక్షతన శనివారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో గెస్ట్ లెక్చరర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రత్నశేఖర్ మాట్లాడుతూ గురజాడ జీవిత చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, డి.మల్లేశ్, ఎం.విజయకృష్ణ పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలకు తోడుగా దాతలు కూడా సహకరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారపుపేటలోని జడ్పీ హైస్కూల్లో తేజోసూర్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కంప్యూటర్ ల్యాబ్‌ను మేయర్ నూర్జహాన్ పెదబాబుతో కలిసి ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ తేజో సూర్యాఫౌండేషన్ కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫౌండేషన్ నిర్వహకులు డాక్టర్ జిద్దు సూర్య సుబ్రహ్మణ్యం, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, హెచ్ఎం ప్రకాశ్, ఎంఈవో అరుణ్‌కుమార్, టీడీపీ నేత లంకపల్లి మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోండి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ-సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలోని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం సూచించారు. ఈ నెల 17న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబరు 2వ తేదీవరకు కొనసాగుతుందని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన 225 ప్రత్యేక వైద్యశిబిరాల్లో మొత్తం 80,138మందికి ఆరోగ్య పరీక్షలు జరిపామని తెలిపారు.

భీమడోలులో వైద్య శిబిరం..

భీమడోలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. గర్భిణీలకు పౌష్టికాహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నదానం



ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి):వినాయక చవితి అన్నసంతర్పణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి మీనా పాల్గొన్నారు. స్వయంగా మీనా అన్నదానం చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మారం హనుమంతరావు, గోవిందు, పి.రాజ పాల్గొన్నారు.

డిసెంబర్‌లో బ్రాహ్మణులకు జాబ్‌మేళా

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ బ్రాహ్మణ యువత భవిష్యత్తుకు కృషి చేస్తానని ఏపీ బ్రాహ్మణ సంఘ సమాఖ్య అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.సమాఖ్య కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజిక వర్గంలోని పేదలను ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. డిసెంబరు 13వ తేదీ గుంటూరులో బ్రాహ్మణ నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళ నిర్వహిస్తున్నామన్నారు. బ్రాహ్మణ యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం: కిశోర్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 29 వార్డులలోని సమస్యలను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సహకారంతో పరిష్కరిస్తున్నట్లు టీడీపీ పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ తెలిపారు.శనివారం టీడీపీ కార్యాలయంలో పట్టణంలోని పలు వార్డుల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ బుధవారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ పట్టణంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారని అన్నారు. వర్షాలు తగ్గగానే ప్రధాన రహదారుల నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంకజ్ సుకుమార్

కస్తూర్బా పాఠశాల పరిశీలన

కుక్కునూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, వేలేరుపాడు మండలంలో ఉన్న మూడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ సుకుమార్, సీఈవో కె.ఎస్.ప్రభాకర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కేరియర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ గురించి వివరించారు. ప్రతీ విద్యార్థి గోల్ రీచ్ అవ్వాలంటే కష్టపడి బాగా చదవాలన్నారు. ఈ రోజుల్లో ఆడపిల్లల్లో ఎన్నో అరాచకాలు జరుగుతున్నందున ఫోన్లకు బానిసకావద్దన్నారు. ప్రభుత్వం మీకు కావల్సిన ఏర్పాట్లన్ని చేస్తున్నందున చదువుపట్ల శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా బాలికల సంక్షేమాధికారి నవీన, స్వాతి, చినబాబు, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రైతులకు డిపాజిట్లు చెల్లించాం

బోడ్డేటి మోహన్‌బాబు, సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు, పోతునూరు



• పోతునూరు సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాలెన్ని?

ఉండ్రాజవరం, పోతునూరు, కేదవరం, లక్ష్మీపురం, దోసపాడు గ్రామాల రైతులు బ్యాంక్ ఖాతాదారులుగా ఉన్నారు.

• బ్యాంక్ ఆర్థిక పరిస్థితి ఏమిటి?

గత వైసీపీ పాలకుల విధానాల కారణంగా రూ.2 కోట్ల 90 లక్షలు నష్టాల్లో బ్యాంక్ ఉంది.

• నష్టాల నివారణకు మీరు తీసుకున్న చర్యలేంటి?

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రత్యేక చొరవ, సహకారంతో పీసీసీ కమిషన్ ద్వారా గత కొన్ని ఏళ్లుగా పెండిగ్‌లో ఉన్న రూ.2 కోట్ల 30 లక్షల డిపాజిట్‌లను రైతులకు చెల్లించాం.

• రైతులకు రుణాలిస్తున్నారా?

ఇప్పటి వరకు సొసైటీ పరిధిలో ఈ సంవత్సరం రూ.5 కోట్లను రైతు నేస్తం, ఎల్‌టీ రుణాలను రైతులకు అందించాం.

• యూరియా కొరత ఉందా?

గత వైసీపీ వారు సొసైటీలో ఎరువుల వ్యాపారం తీసివేశారు. ఎమ్మెల్యే చింతమనేని సహకారంతో ఈ సంవత్సరం రైతులకు అవసరమైన ఎరువులను యూరియాను అందుబాటులో ఉంచాం.

• సహకార సంఘం ఆధ్వర్యంలో ఇంకా అందిస్తున్న సేవలేంటి?

పోతునూరుతో పాటు శివారు గ్రామాల ప్రజలకు రూ.2లకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందిస్తున్నాం. అవసరమైన వారికి కూలింగ్ వాటర్ సైతం అందిస్తున్నాం.

\- దెందులూరు

పట్టిసీమ శివక్షేత్రం బోర్డు ఏర్పాటు



డి.నాగేశ్వరరావు

పోలవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి శివ క్షేత్రం బోర్డు ట్రస్టీల ఎంపిక కార్యక్రమం శనివారం జరిగింది. దేవదాయ శాఖ ధార్మిక పరిషత్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ జారీ చేసిన ఆదేశాల మేరకు ట్రస్ట్ చైర్మన్‌గా కొచ్చర్లకోట వెంకట జగన్నాథరావు, ఉపాధ్యక్షుడిగా టీడీపీ నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షులు డోకల నాగేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు డైరెక్టరుగా పెద్దేహపు నాగభద్రం నియమితులయ్యారు. వారికి పలువురు కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వెటర్నరీ అధికారిగా మహ్మద్ బాజీ

దెందులూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పోతునూరు గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారిగా మహ్మద్ బాజీ బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న దొర బదిలీల్లో భాగంగా గాలాయగూడెం(అక్కిరెడ్డిగూడెం) గ్రామీణ పశు వైద్యశాలకు బదిలీపై వెళ్లారు. కైకలూరు మండలం భుజబలపట్నంలో పని చేస్తు బదిలీపై వచ్చారు. పశుల రైతులు వ్యాధి నివారణ, గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు స్థానిక కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థినులకు స్టడీమెటీరియల్‌ను శనివారం కాశీపట్నం ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. సంస్థ ప్రతినిధి శంకర వెంకటసుబ్బారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జడ్పీ, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్కూలు హెచ్ఎం మాధవీలత, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సుష్మ, టీచర్లు పాల్గొన్నారు.



చిన వెంకన్న సేవలో బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న క్షేత్రాన్ని విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు శనివారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆలయ ఈవో మూర్తిశ్రీవారి శేషవస్త్రాలు అందజేసి వేదాశీర్వచనాన్ని అందించారు. అనంతరం ఎమ్మెల్యేకి ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి శ్రీవారు అమ్మవార్ల చిత్ర పటాలను అందజేశారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

పోలవరం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న చుట్టుగుంట చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తా కథనానికి శనివారం అధికారులు స్పందించారు. చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి ప్రతిగా చెరువు గట్టు వెంబడి యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు.

కలిదిండిలో భారీ వర్షం

కలిదిండి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో సాయంత్రం ఐదు గంటలకు అకస్మాత్తుగా గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రోడ్డు పక్కన తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారు పలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. దీంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సాయంత్రం వర్షం కురవటంతో ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సేద తీరారు.

ఆవుల అదృశ్యంపై ఫిర్యాదు చేయండి

ముదినేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆవులను పోగొట్టుకున్న యజమానులు తమ ఆవుల పూర్తి వివరాలతో సమాచారం అందించాలని ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు కోరారు. యజమానులు ఆవుల ఫోటోలతో సహా ఫిర్యాదు చేయాలన్నారు. ఇటీవల కైకలూరు రూరల్ సర్కిల్ ఏరియాలో దొరికిన ఆవుల్లో గుర్తించి యజమానులకు అప్పగిస్తామని ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

స్థలాన్ని సూచిస్తే పీహెచ్‌సీ నిర్మాణం : ఈఈ



చాట్రాయి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చనుబండ పీహెచ్‌సీ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని సూచిస్తే టెండరు ప్రక్రియ చేపడతామని ఆరోగ్యశాఖ ఈఈ రాజ బాబు అన్నారు. శనివారం చనుబండ వచ్చిన ఆయన కూటమి నాయకులు, వైద్యాధికారులతో కలిసి, వేమిరెడ్డిపల్లి రోడ్డులో దాత విరాళంగా ఇచ్చిన స్థలాన్ని, చనుబండ-నరసింహా రావుపాలెం మధ్య టీడీపీ నాయకులు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చనుబండ పీఏసీఎస్ చైర్మన్ మోరంపూడి శ్రీనివాసరావు ఈఈతో మాట్లాడుతూ వేమిరెడ్డిపల్లి రోడ్డులో దాత విరాళంగా ఇచ్చిన స్థలం గ్రామానికి ఒక కిలోమీటరు దూరంలో ఉన్నదని, పైగా ఈ స్థలం చెరువు పక్కన లో లెవల్‌లో ఉన్నదని మెరక, పునాదులకే ఎక్కువ ఖర్చవుతుందని, పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి రెండు సార్లు టెండర్లు పిలిచినా స్థలం పరిస్థితి చూసి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని అన్నారు. చనుబండ- నరసింహారావు పాలెం మధ్య స్థలం మెరక ప్రదేశంలో ఉన్నదని, ఇక్కడ పీహెచ్‌సీ నిర్మిస్తే అన్ని గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. ప్రస్తుతం రెండు స్థలాలలో పంట ఉన్నందున ఈలోగా తగిన నిర్ణయం తీసుకోవాలని ఈఈ నాయకులను కోరారు. వైద్యాధికారులు శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, ఏఈ రామాంజనేయులు, కూటమి నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, నక్కా రాము, గవర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్డీవోకు వీఆర్‌ఏల వినతిపత్రం



ముదినేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవనం గడుపుతున్నామని, కనీస వేతనాలు ఇప్పించాలంటూ ముదినేపల్లి మండల వీఆర్‌ఏలు ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. శనివారం ఏలూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు మండలం నుంచి 37 మంది వీఆర్‌ఏలు తరలి వెళ్ళారు. అనంతరం సంఘ మండల నాయకు లు కెల్లా సురేష్, రాజేష్, వసంతరావు, గంగాధరరావు, సునీత, బలరామ్ ఆధ్వర్యంలో ఆర్డీవోను కలసి తమ సమస్యలపై మెమొరాండం అందజేశారు. వీఆర్‌ఏల సమస్యలపై ఉన్నతాధికార్లకు వివరిస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు.

కైకలూరు: వీఆర్‌ఏల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌కు కైకలూరు నియోజకవర్గ వీఆర్‌ఏలు వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం ఏలూరులోని ఆర్డీవో కార్యాలయంలో ఆయనకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని, నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కైకలూరు నియోజకవర్గ నాలుగు మండలాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పరిశుభ్రత ఉద్యమంలో భాగస్వాములు కావాలి

చాట్రాయి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత దోహదపడుతుందని ఎంపీడీవో జి. రాజు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చాట్రాయి సచివాలయంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోయటం వల్ల ఈగలు, దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరుగా ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచి ఇంటి ముందుకు వచ్చే చెత్తబండిలో వేయాలని కోరారు. అందరూ చైతన్యంతో పరిశుభ్రత ఉద్యమంలో బాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంఈవో-2 బ్రహ్మచారి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న టీఎల్‌ఎమ్ ప్రదర్శన

ముదినేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదపాలపర్రు జడ్పీ హైస్కూల్లో శనివారం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో చినపాలపర్రు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వి. ప్రసన్న కుమారి ప్రదర్శించిన టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ అందరినీ ఆకట్టుకుంది. హైస్కూల్ హెచ్‌ఎం, కాంప్లెక్స్ చైర్మన్ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రకాల వస్తువులతో తయారు చేసిన అక్షరాలు, మ్యాజిక్ అక్షరాలు, వస్తువులు విశేషంగా ఆకర్షించాయి. సుమారు 15 రకాల టీఎల్‌ఎంను ఆమె రూపొందించగా ఎంఈవో -2 నరేష్‌కుమార్‌తో పాటు, ఉపాధ్యాయులు ప్రసన్నకుమారిని అభినందించారు. గురజ-2 ఎలిమెంటరీ పాఠశాల టీచర్ వల్లూరు సత్యనారాయణ రూపొందించిన టీచింగ్, లెఎర్నింగ్ మెటీరియల్ కూడా అందరినీ ఆకట్టుకుంది. సిఆర్‌పి విజయదుర్గ కూడా పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

నూజివీడు టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో యూపీఎస్సీ శిక్షణపై హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ఆధ్వర్యంలో వెబినార్‌ను నిర్వహించారు. యూపీఎస్సీ కోచింగ్ సంస్థ వజీరామ్ రవి ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగం, పరిపాలన, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్, ఏవో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో కాల్వల పూడికతీత ప్రారంభం



కలిదిండి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లులో శనివారం కాల్వల పూడికతీత పనులను నీటి సంఘం అధ్యక్షుడు కేశిరెడ్డి బలరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కోరుకొల్లులో పలు కాల్వల పూడికతీత పనులు చేపట్టామన్నారు. కాల్వలు పూడిపోవటంతో దిగువకు సాగు, తాగునీరు సరఫరా కాకపోవటంతో రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన కాల్వల పూడికతీత పనులు పూర్తి చేసి సాగు, తాగునీరు అందించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మైనార్టీ యాజమాన్య పాఠశాలలకు..
27 నుంచి దసరా సెలవులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు దసరా సెలవులపై డీఈవో వెంకటలక్ష్మమ్మ శనివారం స్పష్టతనిచ్చారు. మైనార్టీ మేనేజ్‌మెంట్‌లో నిర్వహిస్తోన్న పాఠశాలలకు అకడమిక్ కేలండర్‌లో ప్రకటించినట్టుగా ఈ నెల 27 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సెలవులుంటాయని, మిగిలిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు సెలవులుంటాయని వివరణ ఇచ్చారు. అన్ని పాఠశాలల్లో అక్టోబరు 3 నుంచి తరగతులు యథా తథంగా జరుగు తాయని, ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ నుంచి ప్రభుత్వ మేనేజ్‌మెంట్ లోకి మారిన అన్ని పాఠశాలలకు ప్రభుత్వ యాజమాన్య సెలవులే వర్తిస్తాయన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అంత్యక్రియలకు పాట్లు

- ముంపులో చెక్కపల్లి ఎస్సీ శ్మశానవాటిక
- ఆక్రమణలు తొలగించి, అభివృద్ధి చేయాలని వినతి





చెక్కపల్లి ఎస్సీ శ్మశాన వాటిలో చేరిన నీరు (ఇన్‌సెట్) నీళ్ళలో నుంచి శవపేటికను మోసుకువెళుతున్న కాలనీ వాసులు (ఫైల్)

ముసునూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి సింగినేని కుంటలోని ఎస్సీ శ్మశానవాటిక నీట మునిగింది. దీంతో చనిపోయినవారిని సమాధి చేసేందుకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్మశానవాటికలో అక్రమణలను తొలగించి, అభివృద్ధి చేయాల్సిన అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బుధవారం కాలనీలో ఒక వృద్ధురాలు చనిపోగా శ్మశానవాటిక వర్షపునీటితో పూర్తిగా మునిగిపోవడంతో ఖననం చేసే దారి లేక కట్ట పక్కనే ఆమెను సమాధి చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు బందల కృష్ణ, పొలిమేర బాబూరావు, పింగళ కృష్ణ, చోటబోయిన కుటుంబరావు, రామచంద్రరావు తదితరులు మాట్లాడుతూ 80 ఏళ్ళుగా ఎస్సీ కాలనీ వాసులు సింగినేనికుంట పక్కనే వాగుపోరంబోకుగా ఉన్న 3.30 ఎకరాల భూమిని శ్మశానవాటికగా ఉపయోగించుకుంటున్నామన్నారు. అయితే ఈ భూమిని సమీప రైతులు ఆక్రమించుకుని, ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేయడంలో శ్మశానవాటికలోని సమాధులన్నీ మునిగిపోయి, చనిపోయినవారిని సమాధి చేసేందుకు కొద్దిపాటి భూమి కూడా లేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే 2020 నుంచి ఈ ఆక్రమణలను తొలిగించి, శ్మశానవాటికకు భూమిని కేటాయించి, అభివృద్ధి చేయాలని అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నామని, 2023లో రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు వచ్చి సర్వే చేయకుండా, శ్మశానవాటిక నిమిత్తం 1.5 ఎకరాలను కేటాయిస్తామని, ఉపాధి పథకంలో మట్టితో అభివృద్ధి చేస్తామని చెప్పి మూడేళ్ళు గడిచినా ఇంతవరకు కన్నెత్తి చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వర్షాకాలంలో ఎవరైన చనిపోతే సమాధి చేసేందుకు నరకం చూస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా శ్మశానవాటికకు అధికారకంగా భూమిని కేటాయించి, అభివృద్ధి చేసేలా కలెక్టర్, మంత్రి పార్థసారథి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

మూడేళ్ళ నుంచి పోరాడుతున్నా పట్టించుకోవడం లేదు...



ఎస్సీల శ్మశానవాటిక కోసం మూడేళ్ళ నుంచి పోరాడుతున్నా పాలకులు, అధికారులు పట్టించు కోవడం లేదు. ఎప్పటికప్పుడు అధికారులు కాలయా పన చేస్తున్నారే తప్ప శ్మశానవాటిక సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. వర్షాకాలంలో ముంపుకు గురి కావడంతో చనిపోయినవారిని సమాధి చేసే స్థలం కూడా లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైన సమస్యను పరిష్కరించాలి.

- పల్లి కనకయ్య, ఎస్సీ కాలనీవాసి, చెక్కపల్లి.

పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యం

- మంత్రి పార్థసారథి
- సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ
- కులాల మధ్య చిచ్చు పెడితే సహించనని హెచ్చరిక



సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న మంత్రి

నూజివీడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శనివారం స్థానిక శ్రీనివాసా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం సహాయ నిధి చెక్కులను, కల్లుగీత కార్మికులకు కొత్త కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో కొందరు పెద్దలు సమయం వచ్చినప్పుడు తన పని పడతానని అంటున్నారని, దానికి తాను సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. కులాల మధ్య కుంపటి పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ 15 నెలల కాలంలో నియోజకవర్గంలో రూ.6 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ అందించామని, మరో 15 నుంచి రూ.20కోట్లు ఈ పద్దు కింద అందించనున్నట్లు తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న నిర్మాణాలను పునరుద్ధరణకు రూ.27 కోట్లు మంజూరు చేసి త్వరలో పనులు చేపడుతు న్నామన్నారు. ఉపాధి పథకం ద్వారా రూ.25 కోట్లతో డ్రెయిన్‌లు, సీసీరోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.65 కోట్లతో నూజివీడు పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయటానికి ప్రభుత్వం కృత నిశ్చ యంతో ఉందన్నారు. గత ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ సంస్థ విధించిన రూ.76 కోట్ల పెనాల్టీని జగన్ ప్రభుత్వం చెల్లించకపోవడం వల్లే చింతలపూడి పథకానికి ఈ గతి పట్టిందన్నారు. తొలుత ఆయన 122 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కోటి రూపాయల చెక్కులను, అలాగే 104 మంది కల్లుగీత కార్మికులకు కొత్త కార్డులను పంపిణీ చేశారు. నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనా రాయణ, ఫ్లోర్‌లీడర్ దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, పలువురు కౌన్సిలర్లు, నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా సీజనల్ వ్యాధులు గతంలో కన్నా తగ్గాయని మంత్రి అన్నారు. శనివారం నూజివీడు పట్టణంలోని ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో మొక్కలు నాటించి ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.25 వేల కోట్లకు పైగా ప్రజారోగ్య పరిరక్షణకు ఖర్చు చేస్తోందన్నారు. నూజివీడు పట్టణానికి త్వరలో కొత్త శానిటేషన్ మిషన్లు రానున్నాయని మంత్రి తెలిపారు. శానిటేషన్ మిషన్లతో నూజివీడులో వీధులను శుభ్రం చేస్తామన్నారు. నూజివీడు సబ్‌కలెక్టర్ బి. వినూత్న, తహసీల్దార్ బద్రు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చాట్రాయి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తే భవిష్యత్తు తరాలు బలంగా ఉంటాయని వక్తలు పేర్కొన్నారు. నరసింహారావుపాలెంలో శనివారం నిర్వహించిన స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్ 109 మంది మహిళలు, 26 మంది పురుషులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో దేవపూడి పీహెచ్‌సీ వైద్యాధికార్లు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 200 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ సుధ, బీజేపీ నాయకుడు కోటప్రోలు కృష్ణారావు, కేనం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కొండంగిలో శనివారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మూల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి నస్రీన్ సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, బీజేపీ మండల అధ్యక్షుడు అంకాల దుర్గా ప్రసాద్, కోకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. కోనేరుపేట యూపీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఈ సందర్భంగా నిర్వహించారు. 18 నుంచి 49 సంవత్సరాల మహిళలకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రతి మహిళ ఈ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మోనటరింగ్ ఆఫీసర్ డా. నరేంద్రకృష్ణ తెలిపారు.

కైకలూరు: మహిళలు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సీతనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి అన్నపూర్ణ అన్నారు. శనివారం తామరకొల్లులో వైద్య శిబిరం నిర్వహించి మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు చేసి మందులను అందజేశారు. పిల్లలు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలను వేశారు. వైస్ ఎంపీపీ వెంకటనరసమ్మ, సర్పంచ్ భట్రాజు శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పేరిట మొక్క నాటండి

(5వ పేజీ తరువాయి)

పనిచేయాలన్నారు. రైతు మోరంపూడి మల్లికార్జునరావు పొలంలో వరి పంటకు డ్రోన్ ద్వారా నానో ఎరువుల పిచికారీని పరిశీలించారు. నానో ఎరువులు, డ్రోన్‌ల వినియోగంతో సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. జిల్లా వ్యవసాయాధికారి, షేక్ హబీబ్‌బాషా, డీపీవో అనురాధ, డీఎల్‌డీవో పి.వెంకట రత్నం, తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో కే వాణి, అంగన్‌వాడీ, సచివాలయ, శానిటేషన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ!

(5వ పేజీ తరువాయి)

వేంకటేశ్వరస్వామి గుడి వద్ద, తంగెళ్లమూడి, వన్‌టౌన్ ఏరియాల్లో నాలుగు క్యాంటీన్లు ప్రారంభించారు. అన్న క్యాంటీన్లకు అక్షయపాత్ర ఆహారం సరఫరా చేస్తోంది. మంచి రుచి, నాణ్యతతో కూడిన ఆహారం అందించడంతో కూలీలు, నిరు పేదలు, ఆటో డ్రైవర్లు, చిరువ్యాపారులు, దూరప్రాంతాల నుంచి వచ్చే పేద లు వీటిని ఆశ్రయిస్తున్నారు.

తరచూ అధికారులు తనిఖీలు

వారంలో మూడు, నాలుగు రోజుల పాటు నగరపాలక సంస్థ కమిషనర్ ఈ క్యాంటీన్లను తనిఖీ చేస్తూ ఆహార పదార్థాల నాణ్యత, రుచి ఎలా ఉన్నా యో తెలుసుకుంటున్నారు. అక్కడ సిబ్బందిని పరిసర ప్రాంతాలన్ని పరి శుభ్రంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. శుక్రవారం కలెక్టర్ వెట్రిసెల్వి స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న అన్న క్యాంటీన్ సందర్శించి రుచికరమైన ఆహార పదార్థాలు అందించాలని సిబ్బందిని ఆదేశిం చారు.

బిడ్డ అనారోగ్యాన్ని భరించలేక తల్లి ఆత్మహత్య



దివ్య (ఫైల్)

ఏలూరు క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్ర జ్యోతి): రక్తకణాలు తగ్గి అనారోగ్యం తో బిడ్డ పడుతున్న వేదనను ఆ తల్లి చూడలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. జంగా రెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన బేతాళ దివ్య(23)కు భర్త శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేసుకుని జీవి స్తున్నారు. కుమారుడు సాయి వర్ధన్‌కు అనారోగ్యంగా ఉండ డంతో జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయిస్తు న్నారు. ఈనెల 19న సీఎం సహాయ నిధికి దరఖాస్తు కూడా చేశారు. తన బిడ్డ పడుతు న్న బాధను చూడలేక దివ్య జంగారెడ్డిగూడెంలోని వెంకటేశ్వర స్వామి మెట్ట వద్దకు వెళ్లి పురుగుల మందుతాగి తన కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు వెంటనే ఆమెను జంగారెడ్డిగూడెం ప్రభు త్వాసుపత్రికి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వా స్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

అనారోగ్యంతో బాధపడుతున్న ఒక యువకుడు జీవితంపై విరక్తిచెంది మందుబిళ్లలను నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కైకలూరులోని చింతలచెరువు ప్రాంతానికి చెందిన కొరపాటి వజ్ర (33)కి వివాహం కాలేదు. అనారోగ్యంతో ఉండడంతో వైద్యుడి వద్దకు వెళ్లగా కొన్ని రకాల మందులు ఇవ్వడంతో మందులన్నీ కలుపుకుని ఈ నెల 19న రాత్రి తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా శనివారం ఉదయం మృతి చెందాడు. కైకలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత..

ముసునూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లికి చెందిన కేదాసి లక్ష్మీ(29) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో ఈ 14న భరించలేని నొప్పి రావడంతో ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబీకులు ఆమెను నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి చేర్చగా పరిస్థితి విషమించడంతో రెండు రోజుల క్రితం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి పంపారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి లక్ష్మీ మృతి చెందింది. ఈ ఘటనపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. చిరంజీవి తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రేపటి నుంచి శ్రీశ్యామలాంబ అమ్మవారి దసరా మహోత్సవాలు

- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ఆకర్షిస్తున్న విద్యుత్ దీపాలంకరణ





కైకలూరులోని శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్) అమ్మవారు

కైకలూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆలయాల్లో ఒకటైన కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో శ్రీచండీమహాయాగ సహిత శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆలయాన్ని వివిధ రకాల తోరణాలతో, విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దసరా మహోత్స వాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లును నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఒకే ఆలయంలో మూడు శివాలయాలు ఉండడం విశేషం. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా శ్రీశ్యామలాంబ అమ్మవారు వెలు గొందుతు న్నారు. కైకలూరు పరిసర ప్రాంత ప్రజలు అనేక మంది తమ వ్యాపార సంస్థలకు, పిల్లలకు శ్యామల అనే పేరును పెట్టుకుంటారు. వివిధ రకాల వస్త్రాల తో అలంకరించిన కళామండపం విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది అమ్మవారు 11 అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వ నున్నారు. ఉత్సవాలను ఈ నెల 22న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారు. 22వ తేదీన అమ్మవారు శ్రీబాలా త్రిపురసుందరిగా, 23న గాయత్రీదేవిగా, 24న కాశీ అన్నపూర్ణగా, 25న శ్రీధాన్యలక్ష్మిగా, 26న శ్రీధనలక్ష్మిగా, 27న శ్రీలలితా త్రిపుర సుందరిగా, 28న రాజరాజేశ్వరిగా, 29న సరస్వతిగా, 30న దుర్గమ్మగా, అక్టోబరు 1న పార్వతీదేవిగా, 2న మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిస్తారు. 3న పుష్ప శయన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వచ్చే నెల 6న గ్రామోత్సవం, 7న వేదవిద్వత్ సభ, 12న అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ, ఈవో వీఎస్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి కళామండపం వద్ద సాంస్కృతిక కార్యక్ర మాలు, కోలాట ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు ఈవో శేఖర్ తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జడ్పీ సీఈవో శ్రీహరి

నూజివీడు టౌన్: నూజివీడు మండలం కొత్తూరు తండాలో స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో శ్రీహరి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పరిశుభ్రత ద్వారా సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని, గ్రామస్థులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నాలన్నారు. ఎంపీడీవో చెన్న రాఘవేంద్రనాథ్, సీడీపీవో విజయ్‌కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బాలాజిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ముదినేపల్లి: ముదినేపల్లి మండలంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. వడాలిలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మొక్కలు నాటగా, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముదినేపల్లిలో ఎంపీడీవో వై రామకృష్ణ, సర్పంచ్ కైకమ్మ, డిప్యూటీ ఎంపీడీవో అశోక్, ఉపసర్పంచ్ ఈడే సుధాకర్ తదితరులు ఆధ్వర్యంలో ఉద్యోగులు మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు.

కలిదిండి: కలిదిండిలో సర్పంచ్ ఎం.మారుతి ప్రసన్న పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ ఈవో ఉదయ్ కుమార్, వార్డుసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ఈదర విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈదర జిల్లాపరిషత్ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు వాలీబాల్ విభాగంలో ప్రథమస్థానం సాధించారని హెచ్‌ఎం ఎస్.శారద తెలిపారు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో బాలికలు ప్రథమ స్థానం సాధించారని, అలాగే అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో ఈదర హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. విజేతలను సర్పంచ్ అనిత తదితరులు అభినందించారు.

ముసునూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముసునూరు జడ్పీ పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలు శనివారం ముగిశాయి. వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, కబడ్డీ పోటీలతోపాటు వ్యాయామ క్రీడలను నిర్వహించి, మండల స్థాయి జట్లును ఎంపిక చేశారు. ఈ జట్లు త్వరలో జరిగే డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటాయని ఎస్జీఎఫ్ కో-ఆర్డినేటర్ హేమాదేవి తెలిపారు. విజేతలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు

ముదినేపలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.3 లక్షల పంచాయతీ నిధులతో ముళ్ల పొదల తొలగింపు, పూడిక పనులను శనివారం సర్పంచ్ తాడంకి శిరీష ప్రారం భించారు. రహదారి సౌకర్యాన్ని మెరుగుపర్చటంతో పాటు పూర్తిస్థాయిలో స్మశాన వాటికను అభివృద్ధి చేయనున్నట్లు, షెడ్డును కూడా నిర్మించే ప్రతిపాదన ఉన్నట్లు సర్పంచ్ తెలిపారు.

కోమర్రు మాజీ సర్పంచ్ చిన్ని మృతి

ముదినేపలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోమర్రు పంచాయతీ మాజీ సర్పంచ్ కొల్లి వెంకట సత్యనారాయణ (చిన్ని) (52) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సర్పంచ్‌గా ఆయన గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల సర్పంచ్ కూనపరెడ్డి సాయి కృష్ణ, మాజీ సర్పంచ్ బత్తుల కుసుమ కుమారి సంతాపం తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వ రమ్మ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, చినకామనపూడి సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

తమ్ముడి నుంచి రక్షణ కల్పించండి

పోలీసులకు వితంతు మహిళ ఫిర్యాదు

చాట్రాయి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వయానా తమ్ముడు తనను చంపుతానని బెదిరిస్తున్నాడని, అతనిపై చర్య తీసుకొని తనకు రక్షణ కల్పించాలని మండలంలోని పోలవరం కోనేరు రంగారావు కాలనీకి చెందిన వితంతు మహిళ చిల్లపల్లి మారేశ్వరి శనివారం చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 19వ తేదీ రాత్రి తన తమ్ముడు ఇంటిపైకి వచ్చి దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేసి చంపుతానని బెదిరించాడని, విచారణ జరిపి న్యాయం జరిపించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.